RNI No.: TELTEL2015/62825

# తెలంగాణ సేన

TELANGANA SENA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో

తెలంగాణ సేన దినపత్రికలో పనిచేయుటకు

విలేకరులు కావలెను

జిల్లా రిపోర్టర్ లు, నియోజకవర్గ రిపోర్టర్ లు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ లు కావలెను.

9959236324 9951247932

PUBLISHED FROM : HYDERABAD

సంపుటి : 10 సంచిక : 226 శుక్రవారం 14 - 03 - 2025 ఎడిటర్ : బొమ్మరబోయిన వెంకన్న ముదిరాజ్ అసోసియేట్ ఎడిటర్ : కే రాజేంద్ర ప్రసాద్ పేజీలు : 08 వెల : 2 రూ/-

## రాష్ట్రంలో చీకటి పాలన




- ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి సస్పెన్షన్ పై బీఆర్ఎస్ ఎమ్మెల్యే
- హరీష్ రావు ఆగ్రహ వ్యక్తం
- డా. బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద బీఆర్ఎస్ సభ్యులు నిరసన
- సభ బయట ప్రశ్నిస్తే కేసులు పెట్టడం, సభలో ప్రశ్నిస్తే సస్పెండ్ చేయడం కాంగ్రెస్ పాలన మార్కు

## తెలంగాణ వ్యాప్తంగా

# నిరసనలకు కేటీఆర్ పిలుపు



- ఉద్దేశపూర్వకంగానే జగదీశ్ రెడ్డిని సస్పెండ్ చేశారు
- జగదీశ్ రెడ్డి సస్పెన్షన్ అనంతరం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు,
- ఎమ్మెల్సీలు అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన
- స్పీకర్ పట్ల జగదీశ్ రెడ్డి అగౌరవంగా మాట్లాడలేదని కేటీఆర్ స్పష్టం
- సమావేశాలు పూర్తయ్యే వరకు ఆయనను సస్పెండ్ చేయడం దారుణం

- మిగతా 2 లో




## సునీతా విలియమ్స్ రాక మరింత ఆస్యం

- అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో చిక్కుకుపోయిన భారత అమెరికన్ వ్యోమగామి సునీతా విలియమ్స్
- తొమ్మిది నెలుగా ఐఎస్ఎస్‌లోనే
- శుక్ర లేదా శనివారాల్లో ఈ ప్రయోగాన్ని తిరిగి నిర్వహించే అవకాశం ఉన్నట్లు ప్రకటన

## తమిళనాడు బడ్జెట్ నుంచి

# రూపాయి సింబల్ మాయం

- ఆ స్థానంలో తమిళనాడులో
- రూ అనే అర్థం వచ్చే అక్షరాన్ని చేర్పు
- ఈ నిర్ణయాన్ని స్వాగతించిన తమిళ సంఘాలు
- మాతృభాషను కాపాడుకొనేందుకు తీసుకొన్న చర్యగా అభివర్ణం
- హిందీ భాషను సబ్జెక్టుగా చేర్చడాన్ని డీఎంకే తీవ్రంగా వ్యతిరేకం
- హిందీ-తమిళ భాషపై ముదురుతోన్న వివాదం



హిందీ-తమిళ వివాదం ముదురుతోంది. తాజాగా తమిళనాడు రాష్ట్ర బడ్జెట్ నుంచి రూపాయి సింబల్‌ను తొలగించారు. జాతీయ విద్యావిధానంపై తమిళనాడు, కేంద్రం మధ్య జరుగుతున్న వివాదం మరో మలుపు తిరిగింది. తాజాగా ఆ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రూపాయి సింబల్‌ను తొలగించారు. ఆ స్థానంలో తమిళనాడులో రూ అనే అర్థం వచ్చే అక్షరాన్ని చేర్చారు. దీంతో భాషల వివాదం మరింత ముదిరినట్లైంది. తమిళ సంఘాలు ఈ నిర్ణయాన్ని స్వాగతించాయి. మాతృభాషను కాపాడుకొనేందుకు తీసుకొన్న చర్యగా అభివర్ణించాయి. కాగా మరికొందరు మాత్రం జాతీయ చిహ్నాన్ని తక్కువ చేసి చూపించారని మండిపడ్డారు. ముఖ్యంగా తమిళనాడులో హిందీ భాషను సబ్జెక్టుగా చేర్చడాన్ని డీఎంకే తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఇప్పటికే సీఎం స్టాలిన్ దీనిపై స్పందించారు. "తమిళనాడు విద్యార్థులు మూడో భాషను

- మిగతా 2 లో

## ఎమ్మెల్సీలుగా విజయశాంతి, అద్దంకి దయాకర్, దాసోజు శ్రవణ్ ఏకగ్రీవం





- ఐదు నామినేషన్లు రావడంతో ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి ప్రకటన
- కాంగ్రెస్ నుండి ముగ్గురు, బీఆర్ఎస్, సీపీఐ నుండి ఒక్కొక్కరు చొప్పున ఏకగ్రీవం
- స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్‌లు నిబంధనల మేరకు లేవంటూ రిటర్నింగ్ అధికారి తిరస్కరణ

## ఇంటర్మీడియట్ విద్యలో

# కీలక సంస్కరణలకు శ్రీకారం..!

- విద్యార్థులను ప్రభుత్వ జూనియర్ కాలేజీల వైపు ఆకర్షించేలా పలు కీలక నిర్ణయాలు
- ప్రైవేటు కళాశాలలకు ధీటుగా ప్రభుత్వ జూనియర్ కాలేజీల విద్యార్థులను తయారు
- 2025-26 విద్యాసంవత్సరం నుంచి క్యాలెండర్‌లో మార్పులు
- జూన్ 1వ తేదీకి బదులుగా ఏప్రిల్ 1 నుంచే ప్రభుత్వ కళాశాలలు ప్రారంభం

విస్తృత ప్రజాభిప్రాయ సేకరణ అనంతరం ఇంటర్మీడియట్ బోర్డులో సంస్కరణలకు రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పచ్చజెండా ఊపారు. బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ 77వ సమావేశం అమరావతి అసెంబ్లీలోని పేషిలో మంత్రి లోకేష్ అధ్యక్షతన నిర్వహించారు.



ఇంటర్మీడియట్‌లో విద్యలో నాణ్యత ప్రమాణాలను పెంపొందించి విద్యార్థులను ప్రభుత్వ జూనియర్ కాలేజీల వైపు ఆకర్షించేలా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రైవేటు కళాశాలలకు ధీటుగా ప్రభుత్వ జూనియర్ కాలేజీల విద్యార్థులను తయారు చేసేందుకు 2025-26 విద్యాసంవత్సరం నుంచి క్యాలెండర్‌లో మార్పులు చేపట్టారు. ఇంటర్ విద్యలో కీలక మార్పులు జరగబోతున్నాయి. ఈ విద్యా సంవత్సరం నుంచి జూన్ 1వ తేదీకి బదులుగా ఏప్రిల్ 1 నుంచే ప్రభుత్వ కళాశాలలు ప్రారంభమవుతాయి. జూన్ 1వ తేదీకి బదులుగా ఏప్రిల్ 7 నుండి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులకు అడ్మిషన్లు ప్రారంభిస్తారు. 2025-26 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదివే విద్యార్థులకు వార్షిక పరీక్షలను మార్చి 2026కి బదులుగా ఫిబ్రవరి చివరి వారం నుంచే

- మిగతా 2 లో

## బీఆర్ఎస్, కేసీఆర్‌పై

# నిప్పులు చెరిగిన సీఎం రేవంత్ రెడ్డి



తానేవరూ తెలికుండానే పీసీసీ, ముఖ్యమంత్రిగా అవకాశం కల్పించారా? అంటూ ప్రతిపక్షాలను ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రావాల్సింది తెలంగాణ అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి కాదని, చర్చకు అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. చర్చకు రాకుండా గవర్నర్ ప్రసంగానికి వస్తే అర్థం ఏంటని ప్రశ్నించారు. కేసీఆర్ వ్యవహార శైలిని తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని చెప్పుకొచ్చారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పదేళ్ల

- మిగతా 2 లో

- గాంధీ కుటుంబంతో తనకు మంచి అనుబంధం ఉంది
- ఫొటోలు దిగి చూపించాల్సిన అవసరం లేదు
- బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో కేసీఆర్ ఒక్క పాలసీ తేలేదు
- నిరుద్యోగాన్ని 8.8 నుంచి 6.1 శాతానికి తగ్గించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిది

## మొదటిపేజీ తరువాయి

# రాష్ట్రంలో చీకటి పాలన



జగదీష్ రెడ్డి సస్పెన్షన్ పై డా. బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద బీఆర్ఎస్ సభ్యులు నిరసన వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ.. తెలంగాణ చరిత్రలో ఈరోజు చీకటి రోజ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఈరోజు పట్టపగలు ప్రజాస్వామ్యం గొంతు కోసిందని మండిపడ్డారు. సభ బయట ప్రశ్నిస్తే కేసులు పెట్టడం, సభలో ప్రశ్నిస్తే సస్పెండ్ చేయడం కాంగ్రెస్ పాలన మార్కు అన్నారు. జగదీష్ రెడ్డి గవర్నర్ ప్రసంగంలో తప్పులు ఎత్తి చూపే ప్రయత్నం చేశారని, ప్రతిపక్షాల హక్కులు కాపాడాలని ప్రశ్నిస్తే ఆయనను సస్పెండ్ చేశారని మండిపడ్డారు.మాట్లాడితే దళిత స్పీకర్(%బాజూముుఎవతీ%) అని కాంగ్రెస్ నేతలు ఆయన విలువ తగ్గించే ప్రయత్నం చేసిందన్నారు. దేశంలో అతిపెద్ద అంబేద్కర్ విగ్రహాన్ని, సచివాలయానికి అంబేద్కర్ పేరు పెట్టింది, దళితులకు రూ.10 లక్షలు ఇచ్చింది తమ పార్టీ అని పేర్కొన్నారు. అంబేద్కర్ ను ఓడించింది కాంగ్రెస్ అని, ద్రౌపది ముర్మును సోనియా అవమానించింది నిజం కాదా అని ప్రశ్నించారు. నిజానికి జగదీష్ రెడ్డి సభలో ఏకవచనం సంబోధించలేదని, మీరు అనే పదమే వాడారని వివరించారు. 15 నిముషాల కోసం సభ వాయిదా అని, ఢిల్లీలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి ఆడించిన నాటకం ఇదన్నారు. రేవంత్ రెడ్డి ప్లాన్.. శ్రీధర్ బాబు అమలు చేశారని మండిపడ్డారు.

# తమిళనాడు బడ్జెట్ నుంచి రూపాయి సింబల్ మాయం



నేర్చుకునేందుకు ఎందుకు నిరాకరిస్తున్నారంటూ కొందరు మమ్మల్ని అడుగుతున్నారు. కానీ, ఉత్తరాదిలో మూడో భాష కింద ఏ భాషను నేర్పుతున్నారో చెప్పడం లేదు. అక్కడ రెండు భాషలను మాత్రమే బోధిస్తున్నట్లయితే ఇక్కడ మాత్రం మూడు భాషలను నేర్చుకోవాల్సిన అవసరం ఏముంది? అని ప్రశ్నించారు.విద్యార్థులు మూడు భాషలు నేర్చుకోవాలని ఎన్ఈపీ-2020 సిఫార్సు చేస్తోంది. ఇందులో కచ్చితంగా రెండు భారతీయ భాషలుండాలి. ఈ ఫార్ములా ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలన్నింటికీ వర్తిస్తుంది. అయితే విద్యార్థులకు నేర్పాల్సిన భాషలేమిటన్నది నిర్ణయించుకునే అధికారం రాష్ట్రాలదే.జాతీయ విద్యావిధానంలోని కీలక అంశాలను, త్రిభాషా సూత్రాన్ని అమలు చేయడానికి నిరాకరించిన కారణంగా కేంద్ర ప్రభుత్వం తమిళనాడుకు సమగ్ర శిక్షా అభియాన్ (ఎస్-ఎస్ఏ) కింద అందించాల్సిన రూ.573 కోట్లను నిలిపేసింది. ఎన్ఈపీ మార్గదర్శకాలు అమలు పరిస్తేనే కేంద్రం తన వాటా నిధులు అందిస్తుందని విధాన నిబంధనలు చెబుతున్నాయి.


# ఎమ్మెల్సీలుగా విజయశాంతి, అద్దంకి దయాకర్, దాసోజు శ్రవణ్ ఏకగ్రీవం



తెలంగాణలో ఎమ్మెల్యే కోటాలోని ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు జరిగిన ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. ఐదు స్థానాలకు ఐదు నామినేషన్లు రావడంతో ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ నుండి ముగ్గురు, బీఆర్ఎస్ నుండి ఒకరు, సీపీఐ నుండి ఒకరు ఎమ్మెల్సీ అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలు చేశారు.దీంతో, కాంగ్రెస్ అభ్యర్థులు విజయశాంతి, అద్దంకి దయాకర్, శంకర్ నాయక్, బీఆర్ఎస్ అభ్యర్థి దాసోజు శ్రవణ్, సీపీఐ అభ్యర్థి నెల్లికంటి సత్యం ఎమ్మెల్సీలుగా ఎన్నికైనట్లు ప్రకటించారు.వీరితో పాటు ఆరుగురు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసినప్పటికీ, నిబంధనల మేరకు లేవంటూ రిటర్నింగ్ అధికారి తిరస్కరించారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు నేటి సాయంత్రం ఐదు గంటలకు ముగిసింది. గడువు ముగిసేవరకు ఐదు నామినేషన్లు మాత్రమే రావడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి ప్రకటించారు.

# ఇంటర్మీడియట్ విద్యలో కీలక సంస్కరణలకు శ్రీకారం..!

మొదటిపేజీ తరువాయి



నిర్వహిస్తారు. ట్యాబులేషన్ రిజిస్టర్లను పూర్తిస్థాయిలో డిజిటలైజ్ చేయాలని నిర్ణయించారు. డిజిలాకర్, వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా సజావుగా ఆన్‌లైన్ యాక్సెస్ ఉండేలా 1973 నుండి 2003 వరకు ఇంటర్మీడియట్ బోర్డు ఫలితాల డేటాను డిజిటలైజ్ చేస్తారు. విద్యార్థులకు సబ్జెక్టుల ఎంపికలో సౌలభ్యాన్ని పెంచి, బహుళవిభాగ అభ్యాసాలను ప్రోత్సహించడానికి ఈ విద్యాసంవత్సరం నుంచే మొదటి సంవత్సరం విద్యార్థులకు ఎలక్టివ్ సబ్జెక్టులను 2వ సబ్జెక్టుగా ప్రవేశపెట్టనున్నారు. లాంగ్వేజెస్, సైన్స్, హ్యూమానిటీస్ విభాగాల్లోని 24 ఆప్షన్స్‌లో ఒక సబ్జెక్టును 2వ సబ్జెక్టుగా ఎంపిక చేసుకోవచ్చు. జూనియర్ కళాశాలల్లో ఎంబైపీసీ ప్రవేశపెట్టాలనే ప్రజల డిమాండ్‌కు అనుగుణంగా ఈ విద్యాసంవత్సరం నుంచి మ్యాథ్స్, బయాలజీ సబ్జెక్టులు అంతర్భాగాలుగా 6 సబ్జెక్టులతో ఎంబైపీసీ కోర్సును ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులకు 14 సబ్జెక్టులకు (సైన్స్, హ్యూమానిటీస్, లాంగ్వేజెస్ సహా) సవరించిన సిలబస్‌తో కొత్త పాఠ్యపుస్తకాలు ఈ విద్యా సంవత్సరం నుంచే అమలులోకి వస్తాయి. ఇంటర్మీడియట్‌లో ఇప్పటివరకు రెండు సబ్జెక్టులుగా పరిగణిస్తున్న మ్యాథ్స్ ఏ, బీ లను ఇకపై ఒకే సబ్జెక్టుగా విలీనం చేశారు. అలాగే బైపీసీ విద్యార్థులకు బాటనీ, జువాలజీలు కలిపి ఒకే సబ్జెక్టు ఉండేలా విలీనం చేశారు. ఈ విలీనం వల్ల ఆయా సబ్జెక్టులకు సమాన వెయిటేజీ లభిస్తుంది. ఈఏపీసెట్, జేఈఈ, నీట్ వంటి పరీక్షలకు ప్రభుత్వ కళాశాలల విద్యార్థులను సన్నద్ధం చేయడానికి సమగ్ర పోటీ పరీక్షల కోచింగ్ మెటీరియల్‌ను ఇంటర్మీడియట్ బోర్డు తయారు చేస్తుంది. ఈ మెటీరియల్ బోర్డు పోర్టల్‌లో అందుబాటులో ఉంచుతారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు మెటీరియల్ ను ఉచితంగా అందజేస్తారు.కాంపిటీటివ్ బేస్డ్ ఎసెస్‌మెంట్ కోసం ఇంటర్మీడియట్, సైన్స్, హ్యూమనిటీస్ విభాగాల ప్రశ్నల్లో 10 శాతం తప్పనిసరిగా బహుళ-ఎంపిక ప్రశ్నలు, ఖాళీలను పూరించే రూపంలో ఒక మార్కు ప్రశ్నలు ఉండేలా కొశ్చన్ పేపర్ రూపొందించాలని నిర్ణయించారు. స్థాయి ప్రకారం సిలబస్ సవరణ, వృత్తి విద్యార్థుల కోసం డ్యుయల్ సర్టిఫికేషన్‌ను ప్రవేశపెట్టనున్నారు. నైపుణ్య పర్యావరణ వ్యవస్థను మెరుగుపరచడానికి వీలుగా ప్రమాణాలను నిర్ణయించారు. సమగ్ర నిబంధనలను అభివృద్ధి చేయడం, స్థాయి ప్రకారం వృత్తిపరమైన సిలబస్‌ను మెరుగుపరచడం కోసం భారత ప్రభుత్వ జాతీయ మండలితో సహకరించేలా ప్రణాళిక రూపొందించారు. వృత్తిపరమైన కోర్సుల పాఠ్యాంశాలను ఎప్పటికప్పుడు పరిశ్రమలకు అవసరాలకు తగ్గట్టుగా సవరించడానికి వీలుగా ఆయా ప్రాంతాల్లో ఏర్పాటయ్యే పరిశ్రమలతో ఒప్పందాలు చేసుకోవాలని నిర్ణయించారు.

# బీఆర్ఎస్, కేసీఆర్‌పై నిప్పులు చెరిగిన సీఎం రేవంత్ రెడ్డి

మొదటిపేజీ తరువాయి



పాలనలో కేసీఆర్ ఒక్క పాలసీ తేలేదన్నారు. తెలంగాణలో తాను చేసినన్ని పాలసీలు ఎవ్వరూ చేయలేదని పేర్కొన్నారు. నిరుద్యోగాన్ని 8.8 నుంచి 6.1 శాతానికి తగ్గించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ అధికారం చేపట్టి నాటి నుంచి రూ.2.2 లక్షల కోట్ల పెట్టుబడులను తెలంగాణకి తెచ్చినట్లు వెల్లడించారు. పన్ను వసూళ్లలోనూ తెలంగాణ రాష్ట్రం ముందంజలో ఉందంటూ రేవంత్ తెలిపారు. రైతుల పొలాలు ఎండిపోతుంటే, టన్నెల్?లో ప్రాణాలు పోతుంటే, ప్రజలు కష్టాల్లో ఉంటే బీఆర్ఎస్ నేతలు డ్యాన్సులు వేస్తూ పైశాచిక ఆనందం పొందుతున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.గాంధీ కుటుంబంతో తనకు మంచి అనుబంధం ఉందని, ఫొటోలు దిగి చూపించాల్సిన అవసరం లేదంటూ సీఎం రేవంత్ అన్నారు. తానేవరూ తెలికుండానే పీసీసీ, ముఖ్యమంత్రిగా అవకాశం కల్పించారా? అంటూ ప్రతిపక్షాలను ప్రశ్నించారు. గాంధీ కుటుంబంతో తనకు విబేధాలు వచ్చే అవకాశమే లేదని తేల్చి చెప్పారు రేవంత్. తెలంగాణ సీఎంగా ఉన్నా కాబట్టే రాష్ట్రంలో తనను ప్రశ్నిస్తున్నారని, అలాగే కేంద్రమంత్రిగా కిషన్ రెడ్డి ఉన్నారు కాబట్టే ఆయన్నీ రాష్ట్రానికి కేంద్రం నుంచి రావాల్సిన అంశాలపై ప్రశ్నిస్తున్నారని అన్నారు.మిగతా రాష్ట్రాల కేంద్రమంత్రులు వారివారి రాష్ట్రాలకు కావాల్సినవన్నీ సాధించుకుంటున్నారని, కానీ కిషన్ రెడ్డి మాత్రం తెలంగాణకు రావాల్సిన ప్రాజెక్టులు, నిధుల గురించి పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. తాను ఆరు గ్యారెంటీలు అడగడం లేదని, తెలంగాణకు ప్రధాని ప్రకటించిన రీజనల్ రింగ్ రోడ్డు, మెట్రో, మూసీ, కేంద్ర ప్రాజెక్టులు మాత్రమే అడుగుతున్నట్లు చెప్పుకొచ్చారు. మెట్రోకి క్యాబినెట్ అనుమతి వస్తే పనులు ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు చెప్పుకొచ్చారు. హైదారాబాద్ గేమ్ ఛేంజర్ మెట్రో అంటూ రేవంత్ చెప్పుకొచ్చారు.

# మళ్లీ నిరాశే.. సునీతా విలియమ్స్ రాక మరింత ఆస్యం

మొదటిపేజీ తరువాయి

అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో చిక్కుకుపోయిన భారత అమెరికన్ వ్యోమగామి సునీతా విలియమ్స్ మరోసారి రాశే ఎదురయింది. తొమ్మిది నెలుగా ఐఎస్ఎస్‌లో ఉంటున్న ఆమె భూమి మీదికి రావడం మరింత ఆస్యమయ్యేలా ఉంది. నిరాశే.. సునీతా విలియమ్స్ రాక మరింత ఆస్యం.అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో చిక్కకంపోయిన భారత అమెరికన్ వ్యోమగామి సునీతా విలియమ్స్ మరోసారి నిరాశే ఎదురయింది. తొమ్మిది నెలుగా ఐఎస్ఎస్‌లో ఉంటున్న ఆమె భూమి మీదికి రావడం మరింత ఆస్యమయ్యేలా ఉంది. ఐఎస్ఎస్ నుంచి సునీతతోపాటు బచ్ విల్మోర్‌ను భూమిపైకి తీసుకొచ్చేందుకు నాసా-స్పేస్ ఎక్స్ సంయుక్తంగా చేపట్టిన క్రూ 10 మిషన్‌లో భాగంగా గురువారం జరగాల్సిన ప్రయోగం వాయిదాపడింది. అమెరికాలోని ఫ్లోరిడా నుంచి నుగురు వ్యోమగాముతో ఫ్కాన్ 9 రాకెట్ బయుదగ%ం "నిలిచిపోయింది. హైడ్రాలిక్ సిస్టమ్‌లో సమస్య రావడంతో ఆపేసినట్లు నాసా వ్లెడించింది. శుక్ర లేదా శనివారాల్లో ఈ ప్రయోగాన్ని తిరిగి నిర్వహించే అవకాశం ఉన్నట్లు ప్రకటించింది.



# రేపు తెలంగాణ వ్యాప్తంగా నిరసనలకు కేటీఆర్ పిలుపు



అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నుంచి మాజీ మంత్రి జగదీశ్ రెడ్డిని సస్పెండ్ చేయడంపై బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.ఉద్దేశపూర్వకంగానే జగదీశ్ రెడ్డిని సస్పెండ్ చేశారని ఆరోపించారు. జగదీశ్ రెడ్డి సస్పెన్షన్ అనంతరం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ప్రభుత్వంపై విమర్శలు చేశారు.స్పీకర్ పట్ల జగదీశ్ రెడ్డి అగౌరవంగా మాట్లాడలేదని కేటీఆర్ స్పష్టం చేశారు. అనని మాటను అన్నట్లుగా చిత్రీకరించారని మండిపడ్డారు. నిబంధనలకు విరుద్ధంగా సభలో ఏమీ మాట్లాడకపోయినా.. ఈ సమావేశాలు పూర్తయ్యే వరకు ఆయనను సస్పెండ్ చేయడం దారుణమని కేటీఆర్ అన్నారు. జగీశ్ రెడ్డి స్పీకర్ పట్ల ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని, తాను చేసిన తప్పేంటని వివరణ అడిగే అవకాశం కూడా ఆయనకు ఇవ్వలేదని కేటీఆర్ అన్నారు.స్పీకర్ బాధపడి ఉంటే విచారం వ్యక్తం చేయలని.. సభ సజావుగా జరిగేందుకు సహకరించాలని కేసీఆర్ ఆదేశించారని కేటీఆర్ తెలిపారు. ఇదే విషయాన్ని స్పీకర్, మంత్రి శ్రీధర్ బాబుకు స్పష్టంగా చెప్పామన్నారు. అన్ని పార్టీల అభిప్రాయాలూ తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. అయినా పట్టించుకోకుండా నియంతృత్వ పోకడలతో సభను 5 గంటలపాటు వాయిదా వేశారన్నారు.ఆ తర్వాత నలుగురు ఎమ్మెల్యేలు, ముగ్గురు మంత్రులతో మాట్లాడించి.. జగదీశ్ రెడ్డిని సస్పెండ్ చేస్తున్నట్లు ఏకపక్ష నిర్ణయం తీసుకున్నారని కేటీఆర్ అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వ చర్యకు భవిష్యత్‌లో తగిన మూల్యం చెల్లించుకుంటారని కేటీఆర్ హెచ్చరించారు.కాంగ్రెస్ పార్టీది పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నట్టు.. పేరుకేమో ప్రజాపాలన చేసేదేమో అప్రజాస్వామిక పనులు. రైతాంగం తరుపున, ఆడబిడ్డల తరుపున, ఆరు గ్యారంటీల అమలు గురించి ప్రశ్నిస్తే, తట్టుకోలేక కుయుక్తితో జగదీష్ రెడ్డిని కాంగ్రెస్ ప్రభుత్వం సస్పెండ్ చేసిందని కేటీఆర్ మండిపడ్డారు. రాష్ట్రంలోని ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం చేసేవన్నీ గమనిస్తూనే ఉన్నారని చెప్పారు.ప్రజల తరఫున శాసన సభలో బీఆర్ఎస్ ఉంటే.. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తారనే భయంతో మా గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అప్రజాస్వామిక వైఖరికి వ్యతిరేకంగా, రేవంత్ నియంతృత్వ పోకడలకు వ్యతిరేకంగా రేపు అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టి బొమ్మ దహనానికి పిలుపునిస్తున్నామని కేటీఆర్ తెలిపారు.

**ఆ భయంతోనే సస్పెండ్ చేశారు: జగదీశ్ రెడ్డి**

మరోవైపు, జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తారని, నిన్న రేవంత్ క్లాస్ పీకిందని, ఆయన మెప్పు పొందడానికి ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఇలాంటి సస్పెన్షన్లు ఏవీ మమ్మల్ని ఆపలేవు, ప్రజాక్షేత్రంలో మా గొంతు నొక్కలేవని మాజీ మంత్రి వ్యాఖ్యానించారు.ప్రజలు పడుతున్న కష్టాలను శాసనసభలో మరొక్కసారి ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చే ప్రయత్నం చేశానే తప్ప, అందులో ఒక్క తప్పు మాట కానీ, స్పీకర్‌ని కించపరిచే మాట కానీ అనలేదు. నేను మాట్లాడితే కాంగ్రెస్ ప్రభుత్వం బట్టలిప్పి నిలబెడతాననే భయంతోనే నన్ను అక్రమంగా అసెంబ్లీ నుండి సస్పెండ్ చేశారు అని జగదీశ్ రెడ్డి వ్యాఖ్యానించారు.

# స్వర్ణగిరిలో తిరుప్పావడ సేవ





**భువనగిరి మార్చి 13 తెలంగాణ సేన న్యూస్ :** స్వర్ణగిరి దివ్య క్షేత్రంలో గురువారం వేంకటేశ్వర స్వామి కి తిరుప్పావడ సేవ కార్యక్రమం నిర్వహించారు.అంగరంగ వైభవంగా స్వామి వారి నిత్య కళ్యాణ మహోత్సవం జరిపించారు. అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి కి ప్రాతః కాలంలో అర్చక స్వాములు సుప్రభాత సేవను విశేషంగా నిర్వహించడం జరిగింది.సుప్రభాతసేవ అనంతరం శ్రీ మహాలక్ష్మి అమ్మవారు, ముప్పది మూడు కోట్ల దేవతలు కొలువు తీరినట్టి గోపృష్ఠ దర్శనాన్ని చేయించడం జరిగింది. వేకువ జామున నిత్యారాధన నిమిత్తం అర్చక స్వాములు వేదమంత్రోచ్చారణల తో సువర్ణ బిందె తీర్థమును బంగారు బావి నుంచి తీసుకువచ్చారు.ఉదయం 6 గంటలకు అలంకార ప్రియుడైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి కి అర్చక స్వాములు మేళతాళ మృదంగ మంగళ వాయిద్య ధ్వనుల మధ్య సుగంధ భరితమైన పుష్పమాలల తో మాల సేవను నయన మనోహరంగా నిర్వహించారు.ఉదయం 7 గంటలకు స్వామిని మని మయ శోభిత స్వర్ణాభరణాలతో పరిమళభరిత పుష్పమాలలతో శోభాయమానంగా అలంకరించి వేయి నామాల స్వామి కి సహస్ర నామార్చన సేవను ఘనంగా నిర్వహించారు.స్వర్ణ గిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దివ్య క్షేత్రంలో అష్టలక్ష్మి మండపంలో లోక కళ్యాణం కోసం అర్చక స్వాములు శ్రీ సుదర్శన నారసింహ హవనం ను నిర్వహించారు.కలియుగ ప్రత్యక్ష దైవమైన స్వర్ణ గిరి వారి దివ్య క్షేత్రంలో సకల ప్రాణికోటికి ఆహార కొరత లేకుండా ఉండడం స్వామివారికి జరిపే అన్నకూటోత్సవాన్నే తిరుప్పావడ అంటారు. ప్రతి గురువారం నైవేద్య సమయంలో తిరుప్పావడ జరుగుతుంది తెలిపారు.అప్పుడు సుమారు 450 కిలోల అన్నప్రసాదాన్ని, లడ్డు,వడ, తదితర పిండివంటలను శ్రీవారికి నైవేద్యం చేస్తారు. వేదమంత్రోచ్చారణలతో అర్చించి కర్పూరమంగళ హారతులు సమర్పించారు.ఉదయం 10:30 లకు జగదేక చక్రవర్తి అయిన శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారికి పట్టు పీతాంబరాలు ధరింపజేసి నవరత్నఖచిత స్వర్ణాభరణాలతో,పరిమళ భరిత పుష్ప మాలలతో అలంకరించి శ్రీ స్వామివారి నిత్య కళ్యాణ మహోత్సవాన్ని అర్చక స్వాములు అంగరంగ వైభవంగా నిర్వహించారు.భక్తులు శ్రీవారి కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండుగగా తిలకించారు.ప్రతిరోజు అన్న ప్రసాద వితరణలో భాగంగా ఈరోజు సుమారు 3000 మందికి పైగా భక్తులు నిత్యాన్న ప్రసాదాన్ని స్వీకరించారు.సాయంత్రం 6:30 కు ఆదిమధ్యాంతరహితుడైన మాడవీధులలో శోభాయ మానంగా ఊరేగిస్తూ భక్తుల గోవింద నామస్మరణలతో మేళతాళ మృదంగ మంగళ ధ్వనుల మధ్య శ్రీ స్వామివారి తిరువీధి ఉత్సవ సేవను ఘనంగా నిర్వహించారు.తిరువీధి ఉత్సవ సేవ అనంతరం దేదిప్యమానంగా వెలుగుతున్న సహస్రదీప కాంతుల మధ్య ఊయలలో ఆసీనులై భక్తులకు దర్శనమిచ్చారు.అర్చక స్వాములు వేదమంత్రోచ్చారణలతో శ్రీ స్వామివారిని ఆర్చించి కర్పూర మంగళహారతులు సమర్పించారు.భక్తులు శ్రీవారిని నయనానందకరంగా దర్శించుకున్నారు.

# బ్రిడ్జి నిర్మాణం చేపట్టకపోతే పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు చేస్తాం : సిపిఎం

### ముత్తిరెడ్డిగూడెం మీదిగ వెళ్లే కాల్వపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి



**భువనగిరి , మార్చ్ 13 తెలంగాణ సేన న్యూస్ :** బ్రిడ్జి నిర్మాణం చేపట్టకపోతే రైతాంగాన్ని వృత్తుదారుల ను ప్రజలందరినీ సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని సిపిఎం మండల కార్యదర్శి దయ్యాల నరసింహ పల్లెల అంజయ్య హెచ్చరించారు.బస్వాపురం ప్రాజెక్టు నుంచి ముత్తిరెడ్డిగూడెం కాలువ దాటి వెళ్లే రైతులు, వృత్తిదారులు తమ పొలాల దగ్గరికి పోవడానికి తక్షణం బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. పోరు బాటలో భాగంగా గురువారం మండల పరిధిలోని ముత్తిరెడ్డిగూడెం లో ప్రజా సమస్యలను తెలుసుకున్న అనంతరం కాల్వ దగ్గర బ్రిడ్జి నిర్మాణం చేయాలని రైతులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రాజెక్టు నిర్మాణం జరిగి, కాలువల ద్వారా నీరు వస్తే బీడు భూములు సాగులోకి వచ్చి సస్యశ్యామలమవుతుందని ఆశించిన ప్రాంత ప్రజలకు నిరాశ మిగిలింది అన్నారు. ప్రాంత ప్రజలకు ఉపాధి దొరుకుతుందని"" అడ్డికి పావు షేర్ ""లెక్క లక్షల విలువ చేసే భూమిని కాల్వకు రైతులు భూములను ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. భూమి తీసుకోని అధికారులు, రాజకీయ నాయకులు కాలువ అవతల ఉన్న భూముల దగ్గరికి రైతులు, వృత్తిదారులు ఏ విధంగా వెళ్తారనే సోయి లేకుండా కాలువను తవ్వారని విమర్శించారు. కాలువ అవతలి భాగంలో వందలాది ఎకరాల భూములు ఉన్నాయని, అనేకమంది పాడి రైతులు, గొర్ల కాపర్లు, మత్స్య కార్మికులు కాలువ అవతలి భాగంలో ఉన్నారని వారందరూ ఎట్లా కాలువ దాటుతారని ప్రశ్నించారు. ఇప్పటికే పలుమార్లు సిపిఎం ఆధ్వర్యంలో రైతాంగము పోరాటం చేస్తే ఇదిగో బ్రిడ్జి అదిగో బ్రిడ్జి నిర్మాణం చేస్తామని చెప్పి కాలువలో పైపులు వేసి మట్టి పోశారని అన్నారు. పైపులు వేస్తే పరిష్కారం కాదని దీర్ఘకాలికంగా ఈ ప్రాంత రైతాంగానికి ప్రజలకు ఉపయోగపడడానికి తక్షణం బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శివర్గ సభ్యులు కొండ అశోక్, సిపిఎం సభ్యులు, గ్రామ రైతులు గజ్జి ఐలయ్య, గజ్జి కుమార్, కూకుట్ల రమేష్ , కన్నెమోయిన నర్సింహ, గజ్జి లింగం, కూకుట్ల మంగమ్మ, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ వినియోగదారుల వారోత్సవాలు

### జయశ్రీ ప్రిన్సిపాల్



**నర్సంపేట డివిజన్ తెలంగాణ సేన :** తేదీ 13-3-2025 రోజున ఖానాపూర్ మండలం లోని అయినపల్లి లోని మహాత్మా జ్యోతిరావు పూలే తెలంగాణ వెనకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలలో జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం ఆధ్వర్యంలో ప్రపంచ వినియోగదారుల వారోత్సవాలలో భాగంగా పాఠశాల ప్రిన్సిపల్ జయశ్రీ వారి అధ్యక్షతన జరిగింది.ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర వినియోగదారుల సంఘాల ఉపాధ్యక్షులు రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ ఠాకూర్ రతన్ సింగ్ గారు మాట్లాడుతూ ఈ సమాజంలో మోసాలు,దగాలు, అన్యాయాలు లేకుండా మనం ఏ వస్తువు అయినా సేవలైన ,స్థలాలు అయినా పొందాలనుకుంటే ప్రభుత్వం ద్వారా చట్ట ప్రకారం రిజిస్ట్రేషన్ అయిన సంస్థలనే ఉపయోగించుకోవాలని అన్నారు.రియల్ ఎస్టేట్ రంగంలో భూమి కొనాలంటే రెరా లో రిజిస్టర్ అయిన భూమిని కొనాలి అదేవిధంగా బీ ఐ ఎస్ మార్కు ఉన్న బంగారాన్ని మాత్రమే కొనాలి వస్తువులు కొనాలంటే ఐఎస్ఐ మార్క్ ఉన్న వాటినే కొనాలి అదేవిధంగా ఆహార పదార్థాలు కొనాలంటే ఎఫ్ ఎస్ యస్ ఏ ఐ మార్క్ ఉన్న పదార్థాలనే చూసి కొనాలని అన్నారు. ఒకవేళ వీటిల్లో కూడా మోసాలు జరిగినచో 2019 వినియోగదారుల హక్కుల రక్షణ చట్టం ద్వారా నష్టపరిహారం పొందవచ్చు అన్నారు. తర్వాత జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం అధ్యక్షులు గిరగాని సుదర్శన్ గౌడ్ మాట్లాడుతూ చట్టాన్ని ప్రతి వినియోగదారుడు ఉపయోగించుకొని ఎక్కడ మోసాలు జరగకుండా చూడాలని అన్నారు వాట్సాప్ నెంబరు 88 00 0019 15 ద్వారా మనకు జరిగిన అన్యాయాన్ని మోసాన్ని తెలిపే కాగితాలను కొన్ని బిల్లును అప్లోడ్ చేసి ఫిర్యాదు చేయవచ్చును చట్టం ప్రకారం మనందరికీ న్యాయం చేయబడుతుంది అన్నారు. విద్యార్థినీ విద్యార్థులందరూ ఈ విషయాలను మీ తల్లిదండ్రులకు మీ స్నేహితుల తల్లిదండ్రులకు మీ బంధువులకు అందరికీ తెలిపి అందరిని ఈ చట్టాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.ఇంకా ఈ కార్యక్రమములో స్వయంకృషి స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు బెజ్జంకి ప్రభాకర్ పాఠశాల టీచర్లు విద్యార్థులు పాల్గొన్నారు వారందరికీ 2019 వినియోగదారుల హక్కుల రక్షణ చట్టం కరపత్రాలను అందజేసినారు.

# వృత్తి నైపుణ్యాలకు అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్‌లు

### రాష్ట్రంలో 70 ఏ టి సి కేంద్రాలు వివిధ దశలలో నిర్మాణాలు
### అన్ని రకాల వసతులతో అందరికీ అందుబాటులో పరిశ్రమల కు సమీపంలో ఏర్పాటు
### గ్రామీణ నియోజకవర్గాలలో 45 సెంటర్లు.
### జిల్లా కలెక్టర్ ల తో జూమ్ మీటింగు ద్వారా సమీక్షించిన రాష్ట్ర ఉపాధి కల్పన, శిక్షణ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సంజయ్ కుమార్





**భువనగిరి , మార్చ్ 13 తెలంగాణ సేన న్యూస్ :** యువతలో వృత్తి నైపుణ్యాలను పెంపొందించేందుకు, అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లను ప్రభుత్వం ఏర్పాటు చేయనుందని ఉపాధి కల్పన శిక్షణ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సంజయ్ కుమార్ వెల్లడించారు.గురువారం కలెక్టర్ ల తో జూమ్ మీటింగ్ ద్వారా సమీక్షించారుప్రభుత్వం ఉపాధి కల్పన, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో నూతనంగా గ్రామీణ నియోజకవర్గాలలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లను (ఏటీసీ) ఏర్పాటు చేయనుందని ఇప్పటికే రాష్ట్రంలో 70 ఏటీసీ కేంద్రాల నిర్మాణాలు వివిధ దశలలో కొనసాగుతున్నాయని గుర్తు చేశారు. ఇదే తరహాలో ఐ.టి.ఐ, ఏ.టీ.సీ సెంటర్లు లేని ప్రతి గ్రామీణ ప్రాంత అసెంబ్లీ సెగ్మెంట్ లో కనీసం ఒకటి చొప్పున అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఏటీసీ సెంటర్ల నిర్మాణానికి అనువైన ప్రదేశం, స్థలాన్ని గుర్తిస్తూ సమగ్ర వివరాలతో కూడిన నివేదికలను త్వరితగతిన సమర్పించాలని కలెక్టర్లకు సూచించారు. రాష్ట్రంలో సుమారు 45 ఏటీసీ కేంద్రాలను గ్రామీణ ప్రాంత నియోజకవర్గాలలో నెలకొల్పాలని ప్రభుత్వం నిర్దేశించిందని అన్నారు. రోడ్డు, రవాణా వసతితో పాటు సమీపంలో పరిశ్రమలు ఉన్న స్థలాలను ఎంపిక చేస్తే ఏటీసీ కేంద్రాలలో విద్యార్థులు ప్రవేశాలు పొందేందుకు, ఇన్ స్ట్రక్టర్లు సులువుగా రాకపోకలు సాగించేందుకు వీలుంటుందని సూచించారు. అంతేకాకుండా స్థానిక పరిశ్రమలకు చేరువలో ఏటీసీల ను ఏర్పాటు చేసినట్లయితే, సంబంధిత పారిశ్రామిక అంశాలతో కూడిన ట్రేడ్ లలో యువతకు శిక్షణ అందించేలా ప్రణాళికలు చేపట్ట వచ్చనని అన్నారు. తద్వారా శిక్షణ పూర్తి చేసుకున్న వెంటనే యువతకు స్థానిక పరిశ్రమలలో ఉపాధి అవకాశాలు లభించేందు కు దోహద పడుతాయని తెలిపారు. ఈ అంశాలను పరిగణలోకి తీసుకుంటూ అనువైన ప్రదేశాలలో అందుబాటులో ఉన్న స్థలాల వివరాలతో కూడిన నివేదికలను వెంటనే పంపాలని ప్రిన్సిపల్ సెక్రెటరీ సూచించారు.జూమ్ మీటింగ్ లో కలెక్టర్ హనుమంత రావు, ఐ.టి.ఐ కళాశాల ప్రిన్సిపల్ హరి కృష్ణా,సి పి ఓ శామ్యూల్, జిల్లా ఉపాధి కల్పనాధికారి సాహితి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# బడ్జెట్ లో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయించాలి : ఎబివిపి

### పెండింగ్ లో ఉన్న ఫీ రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి
### ఖాళీగా ఉన్న బోధనా సిబ్బందినీ వెంటనే భర్తీ చేయాలి
### విశ్వవిద్యాలయాల బడ్జెట్ మేరకు బ్లాక్ గ్రాంట్ కేటాయించాలి



**కంటోన్మెంట్, తెలంగాణ సేన న్యూస్ 13 :** వచ్చే ఆర్థిక సంవత్సరానికి ప్రవేశ పెట్టబోయే రాష్ట్ర బడ్జెట్ లో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయించాలని ఏబీవీపీ సికింద్రాబాద్ జిల్లా కన్వీనర్ చెర్క, బాలకృష్ణ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... విద్యారంగంలో సమూల మార్పులు తీసుకొస్తామ ని,అధిక నిధులు కేటాయించి విద్యారంగ అభివృద్ధి కి కృషి చేస్తామని అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ విద్యారంగంపై సవితితల్లి ప్రేమ చూపిస్తుందన్నారు. గత సంవత్సర బడ్జెట్ లో కేవలం 7 శాతం నిధులే కేటాయించిందని వాటిని కూడా పూర్తిగా విడుదల చేయలేదని తెలిపారు. చిన్న రాష్ట్రాలైన ఈశాన్య రాష్ట్రాల్లో సైతం వాటి బడ్జెట్లో 12-13 శాతం నిధులు కేటాయిస్తుంటే మన రాష్ట్రంలో అరకొర నిధులు కేటాయించడం సిగ్గుచేటన్నారు.తెలంగాణ రాష్ట్రం లో 90 శాతం మంది విద్యార్థులు బిసి,ఎస్సి,ఎస్టీ బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులేనని అన్నారు. విశ్వవిద్యాలయాలకు వాటి బడ్జెట్ మేరకు బ్లాక్ గ్రాంట్ పెంచకుండా ప్రైవేటు యూనివర్సిటీల వలె విద్యార్థుల దగ్గర నుండి ఫీజులు వసూలు చేసి జీతాలు ఇచ్చే పరిస్థితి దాపురిం చిందన్నారు. అన్ని యూనివర్సిటీల్లో స్వీయ ఆర్థిక స్వావలంబన పేరుతో ఇబ్బడి ముబ్బడిగా ఫీజులు పెంచి విద్యార్థుల రక్తం తాగుతున్నార న్నారు. రాష్ట్ర పరిధిలోని 11 విశ్వవిద్యాలయాల్లో ఇది వరకే మంజూరు అయినా టీచింగ్ పోస్టులు 2878 అయితే ప్రస్తుతం కేవలం 753 మంది మాత్రమే టీచింగ్ ఫ్యాకల్టీ పనిచేస్తున్నది... అంటే 70 శాతం ఖాళీలతో కాలం వెళ్లదీస్తున్నాయన్నారు. యూనివర్సిటీలకులను నియమించి చేతులు దులుపుకున్న ప్రభుత్వం యూనివర్సిటీ లకు సంబంధించి కీలక నిర్ణయాలను తీసుకునే పాలకమండ ళ్ళను నియమించలేదన్నారు.అధికారంలోకి వచ్చిన తర్వాత జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఒక సంవత్సర కాలంలోనే 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తాం అని సంవత్సర కాలం దాటినా 20 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదన్నారు. గత ప్రభుత్వ కాలంలో ఇచ్చిన నోటిఫికేషన్ తమ ఖాతాలో వేసుకుంటున్నదని దుయ్యబట్టారు.వెంటనే ఈ బడ్జెట్ లో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయించడంతో పాటుగా, వెంటనే పెండింగ్ లో ఉన్న ఫీ రీయింబర్స్మెంట్, స్కాలర్ షిప్స్ ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో ఏబీవీపీ సికింద్రాబాద్ పీజీ కాలేజీ ప్రెసిడెంట్ విజయ్,ఏబీవీపీ నాయకులు విగ్నేష్,తులసి తదితరులు పాల్గొన్నారు.

# కెసిఆర్ పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యల్ని తీవ్రంగా ఖండిస్తున్నాను

### మాజీ ఎమ్మెల్యే శ్రీ చంటిక్రాంతికిరణ్



**అందోల్, తెలంగాణ సేన న్యూస్ :** గౌరవప్రదమైన హోదాలో ఉన్న ముఖ్యమంత్రి ఈ రాష్ట్రంలోని ప్రతి పౌరుడి సంక్షేమాన్ని కోరుకోవాలి ప్రతి ఒక్క వ్యక్తి కూడా సుఖసంతోషాలతో ఉండాలని కోరుకోవాలి అని మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ అన్నారు.కానీ అలా కాకుండా తెలంగాణ ఉద్యమానికి సారథ్యం వహించిన వ్యక్తి, తెలంగాణ రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రి అయిన కేసీఆర్ గారిని మార్చురీలోకి త్వరలో పోతారు అంటూ ముఖ్యమంత్రి మాట్లాడడం చాలా విచారించదగ్గ విషయం.విజ్ఞత కలిగిన వ్యక్తులు ఎవరు కూడా ఇట్లాంటి మాటలు మాట్లాడరు. కేసీఆర్ గారు సీనియర్ నాయకుడే కాదు వయసులో కూడా రేవంత్ రెడ్డి కంటే చాలా పెద్దవారు. అతనికంటే ముందే ఎం ఎల్ ఏ గా ఎం పి గా కేంద్ర మంత్రిగా , ముఖ్యమంత్రిగా చేసిన వ్యక్తి కెసిఆర్ అని,అట్లాంటి వ్యక్తి పట్ల గౌరవాన్ని ప్రదర్శించకుండా మాట్లాడటం సమంజసం కాదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి హితువు పలుకుతున్నా అని చెప్పారు. తాము ఇచ్చిన హామీలను అమలు చేయలేక ప్రజల నుంచి తీవ్రమైన ప్రతిఘటన వస్తున్నందున ఆ ఫ్రస్ట్రేషన్ లో ఏం మాట్లాడుతున్నాడో లేక ఇంకాఇంకేమైన సమస్యలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారో ఏం జరుగుతుందో అనే ముఖ్యమంత్రికే అర్థం కాని పరిస్థితి ఉన్నట్టు కనిపిస్తుంది.అందుకే కొన్ని రోజులు మెడిటేషన్ చేసి లేదా సెలవులు తీసుకుని మనసుకుదుట పడిన తర్వాతనే బాధ్యతలు తీసుకుంటే బాగుంటుంది అని నేను సలహా ఇస్తున్నాను అని తెలిపారు.కేసీఆర్ పై చేసిన వ్యాఖ్యల్ని వెనక్కి తీసుకోవాలని కె సి ఆర్ కి వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# అంగన్వాడి టీచర్ల సమస్యలు పరిష్కరించాలి

### ఎమ్మెల్సీ కోదండరాంకు వినతి




**హైదరాబాద్, తెలంగాణ సేన న్యూస్ :** అంగన్వాడీ టీచర్ ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీ టీచర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం కు వినతి పత్రంను అందజేశారు.అంగన్వాడీ టీచర్ లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుడ్యూటీ చెల్లించాలని తెలిపారు.మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం టీచర్కు రూ.1,8000/-గౌరవ వేతనం చెల్లించాలి. రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్కు రూ?2,00,000/-, ఆయాకు రూ.1,00,000/- వెంటనే ఇవ్వగలరు.రిటైర్మెంట్ వయస్సు 65 సం?ల నుండి 60 సం?ల వరకు మార్చగలరు.వాలంటరీ రిటైర్మెంట్ సదుపాయం కలిపిస్తూ రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వగలరు.డ్యూటీలో ఉండి చనిపోయే టీచర్స్, ఆయాలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కలిపించాలి.ఏ పరీక్ష లేకుండా (ఏ.డబ్ల్యూ. టీ) టీచర్స్కు సూపర్వైజర్ పోస్టును (సర్వీసు ఆధారముగా ఇవ్వాలి.ప్రభుత్వ పాఠశాలకు ఇచ్చినట్టుగా ఒకపూట బడులు, మే నెలలో సెలవులు ఇవ్వగలరని విన్నవించారు. మెనో బిల్లులు పెంచాలి. హెల్త్ కార్డు ఇవ్వాలని, పి.ఎఫ్ సదుపాయం కల్పించాలి. మట్టి ఖర్చులు టీచర్స్కు రూ?20,000/- ఇచ్చినట్టుగా ఆయాలకు ఇవ్వాలి.రెండు యాప్లు కలిపి ఒకటి చేయాలి.ఏ.డబ్ల్యూసి కిరాయిలు ప్రతి నెల 1వ తేది చెల్లించాలి. ఏ.డబ్ల్యూ.టి గౌరవ వేతనం 1వ తేదీ ఇవ్వాలి అని తెలిపారు. యూనియన్ అధ్యక్షురాలు విజయకుమారి, కార్యదర్శి నిర్మల, అన్నపూర్ణ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ప్రాంత సమస్యలను పరిష్కరించండి



**తొర్రురు, తెలంగాణ సేన :** డివిజన్ కేంద్రమైన తొర్రూరు ప్రాంత సమస్యలను పరిష్కరించాలని కోరుతూ లెఫ్ట్ పార్టీ ఆధ్వర్యంలో నేడు జిల్లా అడిషనల్ కలెక్టర్ లెనిన్ తిప్పోత్సవం, ఆర్ అండ్ బి సూపరిండెంట్ భీమా లకు నాయకులకు కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తొర్రూరులో 100 పడకల హాస్పిటల్ మంజూరై సంవత్సరం గడిచిన నేటికీ ఎక్కడ దాని నిర్మాణ పనులు ప్రారంభించకపోవడం సరికాదని అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా హాస్పిటల్ నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించాలని వారు కోరారు. తొరూర్ ప్రధాన రహదారిపై నిర్మిస్తున్న డ్రైనేజీ పనులు అసంపూర్తిగా అడ్డదిడ్డంగా ఉన్నాయని వాటిని వెంటనే పూర్తి చేయాలని కోరారు. రోడ్డు నుంచి డ్రైనేజీ వరకు మధ్యలో సిసి రోడ్డు నిర్మాణం వెంటనే చేపట్టాలని అన్నారు. డివిజన్ కేంద్రమైన తొర్రూరు నుండి ఇతర ప్రాంతాలకు తరలించిన ఆర్ అండ్ బి, నీటిపారుదల,సబ్ ట్రెజరీ ఆఫీస్, సబ్ రిజిస్టర్ ఆఫీస్, ఫైర్ స్టేషన్ తొర్రూర్ లో పునః ప్రారంభించాలని అన్నారు. తొర్రూరు పెద్ద చెరువు మినీ ట్యాంక్ బండ్ పనులు వెంటనే పూర్తి చేయాలని, అర్హులైన పేదలందరికీ డబల్ బెడ్ రూమ్ మంజూరు ఇవ్వాలని వారు కోరారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు రైతులకు ఉపయోగపడే విధంగా అంతర్గత రోడ్లు ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి అజయ్ సారథి రాష్ట్ర సమితి సభ్యులు తమర విశ్వేశ్వరరావు సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి సాయం చిన్న చంద్రన్న కొత్తపల్లి రవి జిల్లా నాయకులు ముజంపల్లి వీరన్న సిపిఎం జిల్లా నాయకులు సమ్మెట రాజమౌళి బొల్లం అశోక్ లతోపాటు చింతకుంట వెంకన్న, పెరుగు కుమార్,ఫైండ్ల యాకయ్య పాలపిందల మల్లయ్య తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. స్పందించిన అధికారులు పై సమస్యలను పరిష్కరించటానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

# గోపాల మిత్రుల ఆధ్వర్యంలో మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం




**తెలంగాణ సేన న్యూస్ :** సిద్దిపేట జిల్లా సిద్దిపేట మండలానికి చెందిన గోపాల మిత్ర మార్గడి వెంకట్ రెడ్డి ఇటీవల మృతి చెందగా ఉమ్మడి మెదక్ జిల్లా గోపాలమిత్ర సంఘం సభ్యుల ఆధ్వర్యంలో గురువారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ఒక లక్ష రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా గోపాల మిత్ర అధ్యక్షులు సింగం రాజు యాదవ్, రాష్ట్ర సలహాదారు శ్రీరాములు, సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి మహిపాల్ రెడ్డి, మెదక్ జిల్లా అధ్యక్షులు అశోక్, మెదక్ జిల్లా మాజీ అధ్యక్షులు రామస్వామి, సూపర్వైజర్ అబ్దుల్ సత్తార్, గోపాల మిత్రులు గౌరీ శంకర్, చంద్రశేఖర్, ఆంజనేయులు, శ్రీనివాస్, కృష్ణ, దేవరాజ్, తిరుపతి రెడ్డి,నర్సింలు, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

# అక్షరాల అభిమన్యుడు వెంకటయ్య సార్... ప్రజా సేవకుడు కొప్పుల మధు



**మహబూబ్ నగర్ తెలంగాణ సేన న్యూస్ :** మిడ్జిల్ మండల నూతన విద్య అధికారిగా (%వీజుూ%) నియమితులైన వెంకటయ్య గారు అక్షరాలతో అభిమన్యుడిలా పోరాడి ఉపాధ్యాయులుగా. ప్రధాన ఉపాధ్యాయులుగా విధులు నిర్మవిస్తూ నేడు మండల విద్యా అధికారి స్థాయికి ఒదిగిన బడిపంతులయ్యను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేసిన ప్రజాసేవకుడు కొప్పుల మధు ఈ కార్యక్రమంలో జిల్లా సమత సైనిక దళ అధ్యక్షులు కోడిగంటి నందం ఉపాధ్యక్షులు మంగునూరి రాము మండల అధ్యక్షులు భీమ్ అనిల్ కుమార్. మిడ్జిల్ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.


# పుస్తకం సల్లగా బతుకాలె!



గత డిసెంబర్ 19న మొదలైన 'హైదరాబాద్ బుక్ ఫెయిర్- 2024' 29వ తేదీతో ముగిసింది. ఈ 11 రోజులు పుస్తక ప్రియులకు అపురూపమైన కాలం. చదువుకునే పిల్లల నుంచి ఎనభై ఏండ్ల వృద్ధుల దాకా అందరూ పుస్తకాలతో తమ అనుబంధాన్ని మరోసారి గుర్తు చేసుకున్నారు. సుమారు 15 లక్షల మంది బుక్ ఫెయిర్‌ను సందర్శించారని నిర్వాహకుల లెక్క. రచయితల అలయ్ బలయ్, అభిమానులతో కరచాలనం, కొత్త పుస్తకాల పలకరింపు చిత్రాలు ఇంకా మొబైళ్లలో చక్కర్లు కొడుతూనే ఉన్నాయి. యువ ప్రచురణకర్తల,రచయితల సందడి ఈ పండుగకు కొత్త అలంకారాలను తెచ్చిపెట్టింది. నూతన కార్యవర్గం నిర్వహణలో ఈ 37వ బుక్ ఫెయిర్ కొత్త పుంతలు తొక్కింది. అధ్యక్షుడు కవి యాకూబ్, కార్యదర్శి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు 'మలుపు' బాల్‌రెడ్డి బుక్ ఫెయిర్ అవసరాలకు అనుగుణంగా కొన్ని మార్పులు చేపట్టారు. ప్రాంగణంలో రెండు వేదికలు ఏర్పాటు చేయడం ఎంతో సౌలభ్యాన్ని పెంచింది. ఈసారి బుక్ ఫెయిర్ ప్రాంగణానికి కవి దాశరథి పేరును పెట్టారు. లోపలి ప్రధాన సమావేశాల వేదికను డాక్టర్ బోయి విజయ భారతి పేరిట ఏర్పాటుచేశారు. పుస్తకాల ఆవిష్కరణ కోసం కొత్తగా గ్యాలరీగా ఏర్పాటుచేసిన మరో వేదికకు 'తోపుడుబండి' సాదిక్ పేరు పెట్టడం ఎంతో సముచితంగా ఉన్నది. 2024, సెప్టెంబర్ 7న ఆయన అకస్మాత్తుగా 61వ ఏట గుండెపోటుతో మరణించారు. పండ్ల బండి మాదిరి తోపుడుబండిలో పుస్తకాలు పెట్టుకొని ఆయన ఎన్నో ఊర్లు తిరిగి పుస్తకాలను పరిచయం చేసి పఠనాసక్తిని పెంచారు. మీడియా పాయింట్‌కు ఇటీవల మరణించిన రచయిత, పాత్రికేయుడు వుప్పల నర్సింహం పేరును, రైటర్స్ స్టాల్‌కు గుస్సాడీ కనకరాజు పేరును పెట్టారు. 'బుక్ ఫెయిర్- 2024' ఏర్పాట్లలో కొంత మెరుగుదల చూడవచ్చు. 300లకు పైగా స్టాళ్లతో కొలువుదీరిన పుస్తకాలు అన్ని వయసుల వారినే కాకుండా అన్ని భావజాలాల వారినీ అలరించాయి. సాధారణంగా పనిరోజుల్లో సాయంత్రం నాలుగింటి నుంచి మొదలయ్యే ప్రవేశ సమయం ఈసారి మధ్యాహ్నానికి మారింది. దీనివల్ల స్టాళ్లను నాలుగు గంటలు ఎక్కువగా సందర్శించే వీలు కలిగింది. ప్రత్యేకంగా ఈ మార్పు బయటి ప్రాంతాలను బుక్‌ఫెయిర్‌కు వచ్చేవారికి సౌలభ్యంగా ఉంటుంది. చీకటి పడకముందే వారు తమ ప్రాంతాలకు వెళ్లవచ్చు. బుక్‌ఫెయిర్‌ను మరింతగా ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు 23న సరికొత్తగా 'పుస్తక నడక/ బుక్ వాక్'ను నిర్వహించారు. ఈ పాద యాత్ర లోయర్ ట్యాంక్‌బండ్ నుంచి దాశరథి ప్రాంగణం దాకా సాగింది. సీనియర్ పాత్రికేయులు, రచయితలు, ప్రచురణకర్తలు పాల్గొన్నారు. కొత్తగా నిర్వహించిన సాహిత్యవేదిక-పుస్తక స్ఫూర్తి కార్యక్రమం గురించి విశేషంగా చెప్పుకోవాలి. ఇందులో రచయితలు తమకు నచ్చిన, తాను మెచ్చిన, తనను ప్రభావితం చేసిన పుస్తకంపై లఘు ప్రసంగం చేస్తారు. దీనివల్ల కొత్త పాఠకులకు మంచి పుస్తకాల సమాచారం తెలిసే అవకాశం ఉంటుంది. సాయంత్రం 6 గంటల నుంచి గంట ఒక సెషన్‌గా రాత్రి 10 దాకా%ా% రోజు మూడు సెషన్లు నడపడం వల్ల అధిక సంఖ్యలో రచయితలకు అవకాశం లభిస్తున్నది. ఒక రోజు కవి, యువ కవి సమ్మేళనాలు జరిగాయి. ఒక్కో సెషన్‌లో రచయితలు, కవుల సంఖ్య ఎక్కువగా ఉన్నందువల్ల సమయం సరిపోని పరిస్థితి ఏర్పడవచ్చు. ఆ సంఖ్యను తగ్గిస్తే బాగుంటుందేమో! గ్రామీణ గ్రంథాలయాల కోసం పుస్తకాలను విరాళంగా ఇచ్చేవారి కోసం హుండీ లాంటి ఏర్పాట్లుచేశారు. చాలా మంది ఇండ్లల్లో చదివిన, పాత పుస్తకాలు ఎన్నో ఉంటాయి. వాటిని తెచ్చి ఇందులో వేయాలనే ఆలోచన వస్తే ప్రయోజనం ఉంటుంది. సాంకేతికత ఎంత పెరిగినా, పీడీఎఫ్ కాపీలు, ఆడియో పుస్తకాలు అందుబాటులోకి వచ్చినా పుస్తకం మాత్రం తన ప్రత్యేకతను, విలువను, గౌరవాన్ని కాపాడుకుంటూనే ఉన్నది. కాగితం మీద అక్షరాన్ని చదవడంలో ఉన్న సౌలభ్యం మరెక్కడా లేదని ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన బుక్‌ఫెయిర్ రుజువు చేసింది. ఇదిలా ఉంటే నవంబర్‌లో వారం రోజుల పాటు బెంగళూరులో పుస్తకోత్సవం కొనసాగింది. భారీగా నిర్వహించే కోల్‌కతా ఇంటర్నేషనల్ బుక్‌ఫెయిర్ ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 9 దాకా ఉంటుంది. ఇలా జైపూర్, ఢిల్లీలలో కూడా పుస్తకాల పండుగ ఘనంగా ఉంటుంది. పుస్తకాల రెపరెపలతో పాటు, రచయితల, పాఠకుల సమ్మేళనం కేవలం పుస్తకోత్సవాల్లోనే సాధ్యపడుతుంది. ఒకరిని ఒకరు కలుసుకునే అవకాశాలు, అవసరాలు తగ్గుతున్న వేళ ఇలాంటి సంబురాలు మనుషులను తీర్చిదిద్దుతాయి. పుస్తక ప్రదర్శనలో అమ్మకాలు సాగాయి, వెచ్చని ఆలింగనాలు కూడా దొరికాయి. ఏటికేడు మరింత నూతనోత్సాహంతో ఈ పండుగ సాగాలి. పుస్తకాన్ని బతికించాలి.

# వసుధైకం ఇంకెప్పుడు?

జనవరి ఫస్ట్..! క్యాలెండర్‌లో నూతన సంవత్సరం ఆరంభమయ్యే రోజు మాత్రమే కాదు, దీనికి మరో ప్రత్యేకత కూడా ఉన్నది. అదే గ్లోబల్ ఫ్యామిలీ డే! ప్రపంచాన్నే కుగ్రామంగా అభివర్ణించుకుంటున్న రోజులివి. ఈ గ్లోబల్ విలేజ్‌లోని మనుషులందరిదీ ఒకటే కుటుంబం. మనందరి గమ్యమూ ఒక్కటే. అదే ప్రేమ, శాంతి! నిజానికి మహోన్నతమైన మానవ జీవితాన్ని మరింత సుసంపన్నం చేసేవీ ఇవే. ఎన్ని సిరిసంపదలున్నా ప్రేమ, శాంతి లేని జీవితం దుర్భరమే కదా! అందుకే, ప్రతి ఒక్కరి హృదయాల్లో సాటి మనుషుల పట్ల ప్రేమ భావనను పురికొల్పడం, విభిన్న సమూహాలు, దేశాల మధ్య శాంతి, సామరస్యాలను పాదుకొల్పడం అనే ఉదాత్త లక్ష్యాలతో ఏటా జనవరి 1న 'గ్లోబల్ ఫ్యామిలీ డే'గా జరుపుకునే సంప్రదాయానికి 1999లోనే శ్రీకారం చుట్టింది ఐక్యరాజ్యసమితి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానపు దన్ను, సమాచార విప్లవం, రవాణా సదుపాయాల విస్తృతి, విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో అందివచ్చిన అవకాశాల నేపథ్యంలో ప్రపంచం కుగ్రామంగా మారిపోయిన మాట నిజమే అయినా, మనుషుల మధ్య, వారి మనసుల మధ్య అంతులేని అగాధం పెరుగుతూనే ఉన్నది. మనం కూర్చున్న చోట నుంచి అంగుళం కూడా కదలకుండానే ప్రపంచాన్ని వీక్షిస్తున్నామన్న సంతోషం ఒకవైపు, కనీసం పక్కనున్న కుటుంబసభ్యులతో మనసు విప్పి మాట్లాడుకోలేని, ఓ పది నిమిషాలు ఆహ్లాదంగా ముచ్చటించుకోలేని దుస్థితిలో చిక్కుకుంటున్నామన్న ఆవేదన మరోవైపు నిత్యం మనల్ని కలచివేస్తూనే ఉన్నది. ఇదొక విచిత్రం. ప్రపంచం కుగ్రామంగా మారుతున్నదా? మన మనసులు ఇరుకవుతున్నాయా? మన జీవితాలు ఏ అనుభూతుల స్పర్శకూ నోచుకోలేనంత యాంత్రికంగా మారుతున్నాయా? ఆలోచించుకోవాల్సిన సందర్భం ఇది. మనిషి సంఘజీవి మాత్రమే కాదు, గొప్ప స్వాప్నికుడు. కలలను సాకారం చేసుకోగల నేర్పరి. సమర్థుడు. నిత్య చైతన్యశీలుడు. అలాంటి మనిషికి ఇవాళ ఏమైంది? తనను తాను పరిపూర్ణ మానవుడిగా, గ్లోబల్ ఫ్యామిలీ మెంబర్‌గా ఆవిష్కరించుకునే ప్రయత్నంలో ఎదురయ్యే సవాళ్లను ఎందుకు అధిగమించలేకపోతున్నాడు? కులం, మతం, వర్ణం, ప్రాంతం అనే సంకుచిత భావాల చుట్టూ తనను తాను ఎందుకు ఇరికించుకుంటున్నాడు? ఒకవైపు నా కులం, నా మతం, నా దేశం అంటూ ఆవేశాలు వెళ్లగక్కుతూనే, మరోవైపు తనదైన చిన్న కుటుంబంలో కూడా ఎందుకు ఇమడలేకపోతున్నాడు? ఇలాంటి ప్రశ్నలకు మనం నిజాయితీగా వెతుక్కునే సమాధానాలే మానవజాతి పురోగమనాన్ని నిర్దేశిస్తాయి. మనిషి విశ్వ మానవుడిగా ఎదగాలన్న ఆకాంక్షలు ఒకవైపు, మనిషికీ మనిషికీ మధ్య, మతానికి మతానికీ మధ్య విద్వేషపూరిత వాతావరణం మరోవైపు.. వెరసి ఆదర్శాలకూ, ఆచరణకూ మధ్య పొంతన కుదరని దురవస్థ. ఈ పరిస్థితికి ఎవరిని నిందించాలి? ప్రజల మానసిక, శారీరక సంపూర్ణ ఆరోగ్యానికి బాటలు వేసే విధానాలను రూపొందించడంలోనూ, వాటిని అమలు చేయడంలోనూ విఫలమవుతున్న పాలకులనే కదా! గ్లోబల్ ఫ్యామిలీ అనే భావన ఎంత ఉన్నతమైనదో, ఎంత ఆదర్శనీయమైనదో దానిని ఆచరించడం అంత కష్టమైనది. మొత్తం ప్రపంచమే ఒక కుగ్రామంగా మారిందని సంతోషిస్తున్న సమయంలోనే మనిషికీ మనిషికీ మధ్య అంతరం పెరుగుతుండటం దురదృష్టకరం. పేదరికం, నిరక్షరాస్యత, ఆర్థిక అసమానతలు, లింగ వివక్ష, కుల, మత, ప్రాంతీయ భేదాలు, విద్వేషాలు, అణచివేతలు, రాజకీయ వైషమ్యాలు, రాష్ట్రాల మధ్య, దేశాల మధ్య శత్రుత్వాలు, యుద్ధాలు, టెర్రరిజం.. ఇలాంటివెన్నో మానవ జీవితాలను శాసిస్తున్నాయి. భయపెడుతున్నాయి. మనిషికీ మనిషికీ మధ్య అడ్డుగోడలు నిర్మిస్తున్నాయి. మన చుట్టూ ఏమి జరుగుతున్నా పట్టించుకోని నిర్లిప్తత, అన్యాయాలను, అక్రమాలను ప్రశ్నించలేని స్వభావం, ఇతరుల కష్టాలను, బాధలను చూసి స్పందించలేని తత్వం పెరుగుతున్నాయి. ఈ ప్రవృత్తే గ్లోబల్ ఫ్యామిలీ అనే భావనకు తొలి శత్రువు. గ్లోబలైజేషన్ యుగం ప్రపంచంలో ప్రతి ఒక్కరికీ ఎక్కడైనా బతికే అవకాశాలను కల్పిస్తున్నది. శాస్త్ర, సాంకేతిక, కమ్యూనికేషన్ రంగాల్లో వస్తున్న విప్లవాత్మక మార్పులు సౌకర్యవంతమైన, విలాసవంతమైన జీవితాన్ని ప్రసాదిస్తున్నాయి. అదే సందర్భంలో మనుషుల మధ్య, సంస్థల మధ్య, కంపెనీల మధ్య, రాష్ట్రాల మధ్య, దేశాల మధ్య అంతులేని పోటీ పెరుగుతున్నది. పోటీ అనేది ఫ్రెండ్లీ వాతావరణంలో ఉంటే తప్పు లేదు. దానిని ఆహ్వానించవచ్చు. అయితే, మార్కెట్‌లో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకొనేందుకు జరుగుతున్న అనారోగ్యకర పోటీ ఒక్కొక్కసారి అనేక అనర్థాలకు దారితీస్తున్నది. మనుషుల మధ్య పూడ్చలేని అగాధాన్ని సృష్టిస్తున్నది. ఆధిపత్య ధోరణులు, జెలసీలు, వైషమ్యాలు, యుద్ధాలను సృష్టిస్తున్నాయి. 'నువ్వు బతుకు.. ఇతరులను బతకనివ్వు..' అనే భావనకు బదులుగా 'నువ్వు ఎదిగేందుకు ఇతరులను తొక్కేయ్.. చంపేయ్' అనే వికృత ఆలోచనలను ప్రోది చేస్తున్నది. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఇలాంటి పెడ ధోరణి గ్లోబల్ ఫ్యామిలీ అనే ఆశయానికి గండి కొడుతున్నది. ఈ పరిస్థితిని సరిదిద్దుకోవాలంటే 'మనమంతా ఒకరి



కోసం మరొకరం' అనే స్ఫూర్తిని ప్రతి ఒక్కరిలోనూ రగిలించాలి.

# బీఆర్ఎస్సే తెలంగాణ ఆదరువు



గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ 2.04 శాతం ఓట్లతోనే ఓడిపోయింది. బీఆర్ఎస్ పదేండ్ల పాలన తర్వాత తెలంగాణ ప్రజలు 39 సీట్లు ఇచ్చిండ్లు. జాతీయ అంశాలు డామినేట్ చేయటం వల్ల లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఒక్క సీటు సాధించలేదు. దీంతో అటు కాంగ్రెస్, ఇటు బీజేపీ%ా% బీఆర్ఎస్ పని అయిపోయింది. 'తెలంగాణలో ఇక మేమే ఉంటం' అని ప్రచారాన్ని మొదలుపెట్టాయి. కానీ, గత ఏడాదిగా జరుగుతున్న పరిణామాలను, పర్యవసానాలను గమనిస్తే తెలంగాణకు, తెలంగాణ ప్రజలకు ఆదెరువు, ఆదరణ మళ్లీ బీఆర్ఎస్ అనే స్పష్టమవుతున్నది. బీఆర్ఎస్ మాయమైపోతదనుకున్న వాదనను పటాపంచలు చేస్తూ ఈ గడ్డ తమదని, ఈ గడ్డ ప్రజల మద్దతు తమకే ఉన్నదని ఈ ఏడాదిలో బీఆర్ఎస్ నిరూపించుకున్నది. ఒకరకంగా చెప్పాలంటే ప్రజల ఆవేదనను తీర్చటంలో, ప్రజల సమస్యలను ప్రముఖంగా ప్రస్తావించటంలో బీఆర్ఎస్ అధికార పాత్ర పోషిస్తుం టే.. కాంగ్రెస్ ఇంకా బీఆర్ఎస్‌పై విమర్శలతో కాలం గడుపుతూ ప్రతిపక్ష పాత్ర నుంచి బయటకు రాలేదన్న అభిప్రాయాలూ అదే స్థాయిలో వ్యక్తమవుతున్నాయి. ఏడాది కాకముందే 'ఈ ప్రభుత్వం మళ్లీ రాదు. కేసీఆర్ అయితేనే తెలంగాణకు న్యాయం చేస్తడు' అనే అభిప్రాయం ప్రజల్లో బహిరంగంగానే వ్యక్తమవుతుండటం తెలంగాణ గడ్డకు, బీఆర్ఎస్‌కు ఉన్న అవినాభా వ సంబంధాన్ని నిరూపిస్తున్నది. 'మేమే ప్రధాన ప్రతిపక్షం' అని అనుకున్న రాష్ట్ర బీజేపీ, కాంగ్రెస్‌తో కుమ్మక్కై, కాంగ్రెస్ విధానాలకు వంత పా డుతూ ఉంటే బీఆర్ఎస్ మాత్రం మొక్కవోని దీక్ష, పట్టుదలతో పోరాటం చేస్తున్నది. ఎక్కడ ప్రజా సమస్యలుంటే అక్కడ బీఆర్ఎస్ నేతలు రెక్కలు కట్టుకొని వాలిపోతున్న సందర్భాలు ఏడాది కాలంగా తెలంగాణ ప్రజా జీవితంలో భాగమైపోయాయి. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఇటు శాసనసభలో, అటు ప్రజాక్షేత్రంలో ప్రతిపక్ష పార్టీగా బీఆర్ఎస్ నామమాత్రపు పాత్ర పోషిస్తున్నదా? అధికారంలో ఉన్న కాంగ్రెస్‌ను ప్రజల మధ్య దోషిగా నిలబెడుతున్నదా? ప్రభుత్వం చేస్తున్న తప్పులను ఎత్తిచూపుతూ, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన అనివార్యతలు సృష్టిస్తున్నదా? ముందూ వెనుకా ఆలోచించకుండా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, వాటి పర్యవసానాలను అంచనా వేసి రాష్ట్ర ప్రయోజనాలు, ప్రజా ప్రయోజనాల కోసం పోరాటం చేస్తున్నదా? తత్ఫలితంగా ప్రభుత్వాన్ని భూ మార్గం పట్టిస్తున్నదా? వంటి అనేకానేక ప్రశ్నలకు ఏడాది కాలంగా బీఆర్ఎస్ ఆచరించిన కార్యాచరణతో ప్రభుత్వం దిగివచ్చిన సందర్భాలు అనేకం కండ్ల ముందున్నాయి. కాగా, గత బీఆర్ఎస్ ప్రభుత్వం పడావుబడ్డ భూముల్లో బంగారం పండేలా వ్యవసాయరంగాన్ని స్థిరీకరించింది. విద్యుత్తు సాధన విషయంలో అచ్చెరువొందే వెలుగు బావుటా ఎగురవేసిన విషయం తెలిసిందే. ప్రజల మనసుల్లో చెరగని సంతకం చేసిన విషయమూ తెలిసిందే. అధికారం కోసమే బీఆర్ఎస్ పుట్టలేదని చెప్పడానికి పద్నాలుగేండ్ల ఉద్యమ ప్రయాణమే నిదర్శనం. అంతేకాదు, కొట్లాడి సాధించుకున్న తెలంగాణకు అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో రోడ్‌మ్యాప్‌ను ఖరారు చేసింది. ప్రజల బాగోగులే తనకు ప్రాణప్రదమని ఆచరించి చూపింది. దేశంలో రాష్ట్రాన్ని ముందువరుసలో నిలిపింది. తెలంగాణ స్వీయ రాజకీయ అస్తిత్వ గరిమ నుంచి ఎట్టి పరిస్థితుల్లో బీఆర్ఎస్ దూరం కాలేదని ఏడాది కాలంగా ప్రతీ సందర్భంలో నిరూపిస్తూనే ఉన్నది. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ కట్టిన హామీల వంతెన ఆ పార్టీకి కత్తుల వంతెనగా రూపాంతరం చెందిందని గడిచిన సంవత్సర కాలంగా జరుగుతున్న పరిణామాలు రుజువు చేస్తూనే ఉన్నాయి. అధికారంలోకి వచ్చీరాగానే కృష్ణా నదీజలాలపై కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం తెలంగాణ రైతాంగానికి అశనిపాతం ఎలా కాబోతున్నదో బీఆర్ఎస్ బట్టబయలు చేసింది. నల్లగొండ గడ్డ మీద కేసీఆర్ బహిరంగసభ సాక్షిగా ధర్మాగ్రహం వ్యక్తం చేసింది. ఫలితంగా కృష్ణా ప్రాజెక్టుల నిర్వహణ బాధ్యతను కేఆర్ఎంబీకి అప్పగించే నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటున్నామని అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం తీర్మానం చేయాల్సిన అనివార్యతను బీఆర్ఎస్ పార్టీ సృష్టించింది. సర్కార్ తీసుకున్న ప్రతీ ప్రజా వ్యతిరేక విధానాన్ని ప్రజల్లో ఉంటూ బీఆర్ఎస్ ఎండగడుతూనే ఉన్నది. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న వ్యక్తిగత, రాజకీయ కక్షసాధింపుల చర్యలను తిప్పికొడుతూ, వాటిని ఎదుర్కొంటూనే ప్రజాక్షేత్రంలో అధికార పార్టీపై పైచేయి సాధించింది. విద్యుత్తు కొనుగోలు ఒప్పందాల విషయంలో ప్రభుత్వం అనుసరించిన వైఖరిని బాహాటంగానే వ్యతిరేకించడం, ఒక రాష్ట్ర హైకోర్టుకు ప్రధాన న్యాయమూర్తిగా వ్యవహరించిన న్యాయ నిపుణుడితో రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కమిషన్ చైర్మన్ అనుసరించిన వైఖరిని తప్పుబట్టి సుప్రీంకోర్టు దాకా వెళ్లడం, ఏకంగా ఆ కమిషన్ చైర్మన్ తప్పుకొనేలా చేయటం బీఆర్ఎస్ సాహసోపేత చర్యగా నిలిచింది. ఇక పదేండ్లుగా పైసా కూడా విద్యుత్తు చార్జీలు పెంచకపోవటమే కాకుండా రైతులకు నాణ్యమైన 24 గంటల ఉచిత కరెంట్ ఇవ్వటం, నాయీ బ్రాహ్మణులు, లాండ్రీలకు 250 యూనిట్ల దాకా ఉచిత కరెంట్ ఇవ్వటం, పరిశ్రమలకు పవర్ హాలీడేలు లేకుండా చేయటం వంటి విద్యుత్తు విజయాలను బీఆర్ఎస్ లిఖించుకున్నది. అలాగే విద్యుత్తు చార్జీలు పెంచి సామాన్యులపై భారం మోపేందుకు సర్కార్ సిద్ధపడినప్పుడు బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రవ్యాప్త నిరసనలు చేపట్టింది. ప్రభుత్వ తీరును ఎండగట్టింది. సర్కారు ప్రతిపాదనను తిరస్కరించేలా విద్యుత్తు రెగ్యులేటరీ కమిషన్ వద్ద బలమైన వాదనలు వినిపించింది. దీంతో విద్యుత్తు ఛార్జీలు పెంచకుండా ప్రభుత్వం దిగొచ్చేలా చేసిన ఘనత బీఆర్ఎస్ సొంతమైంది. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పి దాటవేసిన కాంగ్రెస్ పార్టీ నిజ స్వరూపాన్ని బీఆర్ఎస్ ఎండగట్టింది. శ్వేతపత్రాల పేరుతో తెలంగాణపై మోయలేని అప్పులున్నాయని, ఆ పాపం బీఆర్ఎస్‌దే అన్నట్టుగా కాంగ్రెస్ ప్రభుత్వం అదే పనిగా దుష్ప్రచారం చేస్తూ రైతులను మోసం చేస్తున్నదని గ్రహించిన గులాబీ శ్రేణులు అప్రమత్తమయ్యాయి. ఊరూరా నిరసనలు చేపట్టాయి. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తమకు చేసిన నమ్మకద్రోహాన్ని రైతాంగానికి నివేదించటంలో బీఆర్ఎస్ తన కార్యాచరణ ద్వారా సఫలీకృతమైంది. బీఆర్ఎస్‌కు దగ్గరైన రైతాంగం దృష్టిని తనవైపు మళ్లించేందుకు కాంగ్రెస్ పార్టీ రుణమాఫీ కోసం 'దేవుళ్ల'ను ఆశ్రయించింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేపట్టడం ద్వారా విధిలేని పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీ దశలవారీ రుణమాఫీని చేపట్టాల్సిన అనివార్యతను బీఆర్ఎస్ సృష్టించింది. ఇప్పటికీ రూ.2 లక్షల రుణమాఫీ హామీ సంపూర్ణం కానేలేదు. లగచర్ల, దిలావర్‌పూర్ ఉదంతాలు రైతు, బీఆర్ఎస్ ఉద్యమస్ఫూర్తికి ప్రతిబింబాలుగా చెప్పుకోవచ్చు. రైతుల భూములను కాంగ్రెస్ ప్రభుత్వం లాక్కుంటున్నదని బీఆర్ఎస్ నిరూపించింది. లగచర్ల ఉదంతం విషయంలో గిరిజన రైతుల కోసం ఢిల్లీ దాకా వెళ్లి జాతీయ మానవ హక్కుల కమిషన్, ఎస్సీ, ఎస్టీ కమిషన్, మహిళా కమిషన్ మెట్లు ఎక్కి వారికి బాసటగా నిలిచింది. ఫలితంగా లగచర్లలో ప్రతిపాదిత ఫార్మా కంపెనీల ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటామని ప్రభుత్వం ప్రకటించింది. (కొత్తగా ఇండస్ట్రియల్ క్లస్టర్ అని చెప్తున్నది). మూసీ సుందరీకరణ, హైడ్రా పేర్లతో సాగుతున్న సర్కారు కూల్చివేతలపై బీఆర్ఎస్ సమరం చేస్తున్నది. గూడు కోల్పోయిన పేదల తరఫున ఒకవైపు న్యాయపోరాటం, మరోవైపు ప్రజాపోరాటం చేస్తూ నిరాశ్రయులైనవారికి వెన్నుదన్నుగా నిలిచింది. ఎవరికి ఏ కష్టం వచ్చినా తమ గోడును విని, అందుకు సరైన పరిష్కార మార్గం చూపే వేదికగా ప్రజలు తెలంగాణ భవన్‌ను చూస్తున్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో అన్నివర్గాల బాధలను తన బాధలా స్వీకరించినట్టే తెలంగాణ భవన్ ఏడాది కాలంగా ప్రతీ వర్గం కన్నీటిని తుడిచే నేస్తమైంది. నాయకత్వంపై వ్యక్తిగత కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నా బాధ్యతాయుత ప్రతిపక్షంగా బీఆర్ఎస్ తన పాత్రను పోషిస్తున్నది. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అవినీతి, ఆశ్రిత పక్షపాతాన్ని ప్రదర్శిస్తున్నదని ఆధారాలతో సహా బీఆర్ఎస్ పార్టీ గల్లీ నుంచి ఢిల్లీ దాకా అనేక అంశాల్లో నిరూపించింది. స్వచ్ఛబయో, అమృత్ పథకం టెండర్ల గోల్‌మాల్, బియ్యం కొనుగోళ్లలో వేల కోట్ల అవినీతి వంటి అంశాల్లో కాంగ్రెస్ పార్టీ అసలు నీతిని ఎండగడుతున్నది. అదానీతో కాంగ్రెస్ ప్రభుత్వం అంటకాగుతున్న వైఖరిని ప్రజాక్షేత్రంలో బీఆర్ఎస్ బయట పెట్టడంతో స్కిల్ యూనివర్సిటీకి అదానీ ఇచ్చిన రూ.100 కోట్ల విరాళాన్ని వెనక్కి ఇవ్వాల్సిన అనివార్యతను బీఆర్ఎస్ సృష్టించింది. మొత్తంగా తెలంగాణలో బీఆర్ఎస్ పని అయిపోయిందని, 'తెలంగాణలో ఇక మేమే ఉంటం' అని స్వీయ ప్రచార పటాటోపంతో పోటా పోటీగా చెలరేగిపోయిన కాంగ్రెస్, బీజేపీ ఆటలు సాగవని గడచిన ఏడాది కాలంలో ప్రతీ సందర్భంలోనూ నిరూపించింది. తెలంగాణ ప్రజలకు ఆదెరువు, ఆదరణ మళ్లీ బీఆర్ఎస్ అనేది కండ్లముందు కనిపిస్తున్న కఠోర సత్యం.


# తాటాకు చప్పుళ్లకు తలొగ్గరు



ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతిపక్ష పాత్ర చాలా గొప్పది. ప్రజా సమస్యలను ప్రభుత్వానికి తెలియజేస్తూ, ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటుంది. ప్రభుత్వం చేసే తప్పులను ఎత్తిచూపుతూ ఉంటుంది. భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ప్రతిపక్ష పార్టీగా ఉన్నప్పటి నుంచీ బాధ్యతాయుతమైన, నిర్మాణాత్మకమైన ప్రతిపక్షంగా వ్యవహరిస్తూ ప్రభుత్వాన్ని నిద్రమత్తు నుంచి మేల్కొలుపుతూ వస్తున్నది. అయితే, దీనిని జీర్ణించుకోలేకపోతున్న కాంగ్రెస్ మాత్రం కక్షపూరిత రాజకీయాలు చేస్తూ, కేసులను అస్త్రంగా వాడుకుంటూ బీఆర్ఎస్ నాయకులను అణచివేయాలని చూస్తున్నది. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీల వాగ్దానాలను నిలబెట్టుకోవడం లో ప్రభుత్వం విఫలమైంది. ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో బీఆర్ఎస్ నాయకులు సఫలీకృతులయ్యారు. ప్రజల్లో ఉంటూ కాంగ్రెస్ తీరును ఎండగడుతున్నారు. 'ఫార్ములా-ఈ' కార్ రేస్ విషయంలో ఏదో జరిగిపోయిందని గగ్గోలు పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఇరికించే ప్రయత్నం చేస్తున్నది. ఆయనపై విచారణకు గవర్నర్ అనుమతి కోరడం, ఆయన వెంటనే ఆమోదించడం కాంగ్రెస్-బీజేపీ లోపాయికారి మైత్రికి నిదర్శనం. కార్ రేస్ నిర్వహణ కోసం ఫార్ములా ఈ ఆపరేషన్స్ (ఎఫ్ఈవో), ఏస్ నెక్స్‌జెన్ ప్రైవేట్ లిమిడెట్, గ్రీన్ కో స్పాన్సర్‌షిప్ కలిసి పురపాలక శాఖతో 2022 అక్టోబర్ 25న ఒప్పందం చేసుకున్నాయి. ఈ ఒప్పందం ద్వారా ప్రభుత్వానికి తప్ప తమకు ఎలాంటి లాభం లేదన్న కారణంతో రెండో విడత రేస్ నుంచి గ్రీన్ కో తప్పుకున్నది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రభుత్వ అసమర్థతను ఎప్పటికప్పుడు నిలదీస్తూ అధికార కాంగ్రెస్ పార్టీనినడిబజార్లో నిలబెడుతుండటంతో సీఎం గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పరుగులు పెట్టించిన నాయకుల్లో కేటీఆర్ ముఖ్యుడు అనే విషయాన్ని కాంగ్రెస్ గుర్తుంచుకుంటే మంచిది. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను కాపాడటం కోసం నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 55 కోట్లు చెల్లించింది. ఈ మొత్తం వ్యవహారంలో కేటీఆర్ తప్పు ఇసుమంతైనా లేదు. హెచ్ఎండీఏ తీసుకునే నిర్ణయాలకు మంత్రివర్గ అనుమతులు అవసరం లేదన్న విషయం అందరికీ తెలిసిందే. పురపాలక శాఖలో జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏకి అంతర్గతంగా డబ్బు సర్దుబాటు చేసుకునే వెసులుబాటు ఉంటుంది. అంతా చట్టబద్ధంగా, సవ్యంగా జరిగిన పనిపై కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయంగా ఆరోపణలు చేస్తూ తప్పుడు కేసుల్లో కేటీఆర్‌ను ఇరికించాలని చూస్తున్నది. హెచ్ఎండీఏ క్యాబినెట్ అనుమతి తీసుకోలేదని, చెల్లింపుల్లో అక్రమాలు జరిగాయని అడ్డదిడ్డంగా వాదిస్తున్నది. ఇది ముమ్మాటికీ ప్రజలను తప్పుదోవ పట్టించడమే. రేస్ కారణంగా తెలంగాణకు దాదాపు రూ. 7 వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఈ ఘనత ముమ్మాటికీ కేటీఆర్‌కే దక్కుతుంది. అలాంటి వ్యక్తిపై కక్షపూరితంగా కేసులు పెట్టడం అన్యాయం. రాష్ట్రాభివృద్ధిపై దృష్టి పెట్టాల్సిన ప్రభుత్వం ప్రతిపక్ష నాయకులపై కేసులు పెట్టడం దేనికి సంకేతమో అర్థం కావడం లేదు. 'ఫార్ములా-ఈ' రేస్ వ్యవహారంలో కేటీఆర్‌పై కేసు పెట్టడంతో దీని ప్రభావం అంతర్జాతీయంగానూ ఉంటుంది. రేపటి రోజున తెలంగాణకు విదేశీ పెట్టుబడులు రావాలంటే భయపడే అవకాశం ఉంది. బెదిరింపులకు లొంగని, కేసులకు భయపడని నాయకుడు కేటీఆర్. ఇటువంటి అక్రమ కేసులకు ఆయన భయపడతాడనుకుంటే అది కాంగ్రెస్ నేతల మూర?త్వమే అవుతుంది. సోషల్ మీడియాలో విష ప్రచారం ద్వారా రాష్ట్రానికి కేసీఆర్, కేటీఆర్ చేసిన మంచిని చెరిపేయాలనుకోవడం ఉత్త భ్రమ మాత్రమే. ప్రకటించిన పథకాలను అమలు చేయలేక, ప్రజలకు ఏమి చెప్పాలో తెలియని పరిస్థితుల్లో వారి దృష్టి మళ్లించేందుకు బీఆర్ఎస్ నేతలపై కేసులు పెడుతూ పబ్బం గడుపుకొంటున్నది. అభివృద్ధి విషయంలో తెలంగాణను వెనుకకు నెడుతున్నది. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ ప్రజల హక్కులను హరిస్తున్నది. ఇందుకు కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్ల ఘటనే ఉదాహరణ. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతున్నందుకు పగతో రగలిపోతున్న ప్రభుత్వం కేటీఆర్‌ను అణచివేసే కుట్రలు చేస్తున్నది. అందులో భాగంగానే జైలుకు పంపేందుకు కుట్రలు చేస్తున్నది. ప్రభుత్వ అసమర్థతను ఎప్పటికప్పుడు నిలదీస్తూ నడి బజార్లో నిలబెడుతుండటంతో సీఎం రేవంత్‌రెడ్డి గుండెల్లో గుబులు పుడుతున్నది. తెలంగాణ కోసం అలుపెరగక పోరాడి, సాధించుకున్న తెలంగాణను అభివృద్ధి, సంక్షేమంలో ముందు వరుసలో నిలబెట్టిన గొప్ప నాయకుడు కేటీఆర్ అనే విషయం యావత్ తెలంగాణ ప్రజలకు తెలుసు. ప్రభుత్వ తాటాకు చప్పుళ్లకు కేటీఆర్ లొంగరు. ఆయ న పోరాటం తెలంగాణ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసమే.

# రైతు గతిని మార్చిన

2018, జనవరి 1 చరిత్రాత్మకమైన రోజు. నూతన సంవత్సర ప్రారంభ వేడుకల్లో పడి క్యాలెండర్లో మరుగున పడిపోయే మామూలు రోజు కాదు. తెలంగాణ రాష్ట్ర రైతాంగం చిరకాల స్వప్నం అయిన వ్యవసాయానికి 24 గంటల ఉచిత కరెంటనే పల్లకిని మోసుకొచ్చిన పర్వదినం. బోరు మోటార్ల మీద ఆధారపడి వ్యవసాయం చేసుకుంటున్న తెలంగాణ రైతాంగానికి పండుగ రోజు. 2014కు పూర్వం దశాబ్దాల తరబడి కరెంటు కోతలతో, లో ఓల్టేజీ సమస్యలతో తెలంగాణ ప్రాంతం అంధకారమైంది. ఎండిన పంట పొలాల సాక్షిగా వేల మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. అర్ధరాత్రి కరెంటు వల్ల ప్రమాదాలు, పాముకాట్లకు రైతులు, విద్యుత్తు కార్మికుల ప్రాణాలు గాల్లో కలిసిపోయిన గడ్డు రోజులు. ఓ దిక్కున పంట పొలాలు ఎండిపోతుంటే, మరోపక్కన రైతుల ఆత్మహత్యలతో తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో యుద్ధ వాతావరణం కనిపించేది. ప్రజల అసంతృప్త జ్వాలలు, సబ్ స్టేషన్ల వద్ద ధర్నాలు, చీటికిమాటికి రాస్తారోకోలతో భీతావహ వాతావరణం ఉండేది. పండుగలకు, గ్రామాల్లో ఏమైనా శుభకార్యాలు జరిగినప్పుడు లేదా ఎవరైనా చనిపోయినా అంత్యక్రియల అనంతరం స్నానపానాదుల నిమిత్తం పగటిపూట అరగంట కరెంటు ఇవ్వడానికి ఆపసోపాలు పడిన నేపథ్యం ఇప్పటికీ ప్రజల మనసుల్లో స్పష్టంగా ఉన్నది. అటువంటి దుర్భరమైన పరిస్థితుల్లో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుమారు 22 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు పగటిపూట 9 గంటల కరెంటు ఇవ్వడానికి కావాల్సిన అదనపు సబ్‌స్టేషన్ల నిర్మాణం, పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంపునకు కావాల్సిన నిధులు కేటాయించి తగిన ఆదేశిలిచ్చారు. అంతకుముందు విడతలవారీగా వ్యవసాయ ఫీడర్లను విభజించి పగలు మూడు గంటలు, రాత్రి మూడు గంటలు కరెంటు ఇచ్చేవారు.



ఒకేసారి అన్ని ఫీడర్లకు ఏకబిగిన విద్యుత్తు సరఫరా చేయడానికి కావాల్సిన మౌలిక వసతులు అభివృద్ధి చేయడానికి భారీ కసరత్తు చేయడంతో వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్తు సాధ్యపడింది. అందుకుగాను సుమారు రూ. 12,610 కోట్లను ఖర్చు చేసినట్టు అంచనా. మొదటగా 2016, జూలై నుంచి ఉమ్మడి కరీంనగర్, మెదక్, నల్లగొండ జిల్లాల రైతులకు ప్రయోగాత్మకంగా 24 గంటల విద్యుత్తును సరఫరా చేశారు. అనంతరం అదే ఏడాది నవంబర్ 6 నుంచి 20వ తేదీ వరకు 15 రోజులపాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోని 22 లక్షల 60 వేల వ్యవసాయ పంపుసెట్లకు ప్రయోగాత్మకంగా 24 గంటల సరఫరా విజయవంతంగా అందించడం జరిగింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 2018 జనవరి 1 నుంచి రైతులందరికీ ఉచితంగా 24 గంటల కరెంటు అందివ్వడమనే ప్రక్రియ విజయవంతంగా కొనసాగుతున్నది. అదొక సంచలన నిర్ణయం అనడంలో ఎలాంటి సందేహం లేదు. తెలంగాణ మినహా భారతదేశంలోని మరే రాష్ట్రంలోనూ నేటి వరకు రైతులకు 24 గంటల కరెంటు ఉచితంగా ఇవ్వడం లేదు. పశ్చిమ బెంగాల్, కేరళ, ఉత్తరప్రదేశ్‌లలో 9 గంటలు, గుజరాత్‌లో 8 గంటలు, మధ్యప్రదేశ్‌లో 9 గంటలు మాత్రమే ఇస్తున్నా రు. ఏపీ, కర్ణాటక, మధ్యప్రదేశ్ మాత్రం ఉచితంగా ఇస్తున్నాయి. మిగతా రాష్ట్రాలు రైతుల నుంచి చార్జీలను వసూలు చేస్తున్నాయి. 24 గంటల ఉచిత విద్యుత్తు అందుతున్న క్రమంలో రైతులు తప్పనిసరిగా ఆటోమెటిక్ స్టార్టర్లను తొలగించకుంటే భూగర్భ జలాలు వృథా అవడమే కాకుండా విద్యుత్తు నష్టం కూడా జరుగుతుంది. భూగర్భ జలాల మట్టం పడిపోవడమే కాకుండా లోతు తక్కువగా ఉన్న బోర్లలో నీరు ఇంకిపోయే ప్రమాదం ఉంది. అవసరమైన మేర మాత్రమే నీటిని వాడుకుంటూ పర్యావరణాన్ని, ప్రకృతిని, నీటి వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత రైతాంగంపై ఉన్నది. దేశంలోనే అత్యధిక పంటదిగుబడులు సాధించడానికి ప్రధాన కారణమైన వ్యవసాయ రంగానికి నిరంతర ఉచిత విద్యుత్తు పథకం కొనసాగడం అనివార్యంగా పరిణమించిందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

తెలంగాణ సేన
TELANGANA SENA TELUGU DAILY
తెలుగు దినపత్రిక
శుక్రవారం 14 - 03 - 2025

# కాంగ్రెస్‌లో కోవర్టులు కొత్త వాస్తవమా?

వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయన సరిగా పనిచేయడం లేదని నలుగురైదుగురు కాంగ్రెస్ నేతలు తరుచూ ఢిల్లీ వచ్చి సోనియాగాంధీకి ఫిర్యాదు చేస్తూ ఉండేవారు. అప్పుడు ఢిల్లీలో కూడా కాంగ్రెస్ అధికారంలో ఉండేది కనుక పార్లమెంట్‌లో కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో ఆమెను కలుసుకునేందుకు నేతలు క్యూలు కట్టేవారు. ఒక రోజు సోనియాగాంధీ లోక్ సభలోనే ఒక వర్కింగ్ కమిటీ సభ్యుడితో మాట్లాడుతూ 'ఇదేమిటి? వైఎస్‌పై ఎప్పుడూ ఏవో ఫిర్యాదులు వస్తున్నాయి' అని అడిగారు. 'మేడమ్, మీ పక్కన మన్మోహన్ సింగ్, ప్రణబ్ ముఖర్జీ, శరద్ పవార్, లాలూ ప్రసాద్ యాదవ్, చిదంబరం, నేనూ కూర్చున్నాం. మన్మోహన్ సింగ్ ఎప్పుడూ ఎన్నికల్లో నెగ్గలేదు. చిదంబరం ఎంపీగా ఉన్న తమిళనాడులో కాంగ్రెస్ ఎప్పుడూ అధికారంలోకి రాలేదు. శరద్ పవార్, లాలూ ప్రసాద్ యాదవ్ మన పార్టీ కాదు. ప్రణబ్ ముఖర్జీ నాలాగే మొదటి సారి ఎన్నికల్లో గెలిచారు. మీరు యూపీ నుంచి గెలిచారు కాని యూపీలో మన పార్టీ లేదు. పార్టీ పెద్దలు ప్రాతినిధ్యం వహిస్తున్న అనేక రాష్ట్రాల్లో కాంగ్రెస్ ఓడిపోతే, మరి కాంగ్రెస్ పార్టీని గెలిపించి అధికారంలోకి తీసుకువచ్చిన వైఎస్ మీద ఫిర్యాదులు వస్తే ఆయన అధికారం ఎలా చలాయించాలో మనం చెప్పగలమా..' అని ఆయన జవాబిచ్చారు. అందుకు సోనియా నిజమే.. అని నవ్వుతూ అంగీకరించారు. మరునాడు సెంట్రల్ హాలు గుండా వెళుతుండగా ఒక మాజీ ఎంపీ ఆమె వెంటపడి వైఎస్‌పై ఏవో ఫిర్యాదులు చేయబోతే గట్టిగా మందలించారు. 'మీకు ఇదే పనా?' అని అడిగారు. దీనితో ఆయన ఖంగుతిని వెళ్లిపోయారు. మొదట్లో వైఎస్ మాటిమాటికీ ఢిల్లీ వచ్చి రాష్ట్ర పరిణామాల గురించి వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చేది. ఎవరు ఏ లేఖలు రాసినా, ఫిర్యాదులు చేసినా ఆయనను పిలిపించేవారు. కాని ఆయన క్రమంగా తనకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నవారిపై పై చేయి సాధించారు. వారి ఎత్తులకు పై ఎత్తు వేసేవారు. అధిష్ఠానం వద్ద తన నిర్ణయాల గురించి గట్టిగా వాదించేవారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటును బలంగా వ్యతిరేకించేవారు. ఒక సందర్భంలో తాను రాజీనామా చేసి బెంగళూరు వెళిపోతానని చెప్పినట్లు సమాచారం. తొలి రోజుల్లో తాను అంతరాత్మగా వ్యవహరించే కేవీపీ రామచందర్‌రావుకు రాజ్యసభ టికెట్ ఇప్పించుకోలేకపోయారు. కాని క్రమంగా అధిష్ఠానంపై పట్టు సాధించిన తర్వాత కేవీపీకి టికెట్ ఇవ్వాల్సి వచ్చింది. తన వర్గీయులకే ఎమ్మెల్యే టిక్కెట్లు ఇప్పించుకోగలిగిన శక్తి ఆయన సంపాదించారు. కాంగ్రెస్ రాజకీయాలు అప్పటికీ ఇప్పటికీ ఏమైనా మారాయా? అధిష్ఠానం విన్నా, వినకపోయినా ఇప్పటికీ ఢిల్లీ వచ్చి నేతల్ని కలుసుకుని ఫిర్యాదులు చేసేవారు మాత్రం మారలేదు. సోనియాగాంధీ పార్టీ ప్రధాన కార్యదర్శులు, రాష్ట్రాల ఇన్‌ఛార్జిల నివేదికలకు ఎక్కువ విలువ ఇచ్చేవారు. వారు మేనేజ్ అవుతున్నారంటే మార్చేసేవారు. కాంగ్రెస్ దాదాపు అన్ని రాష్ట్రాల్లో అధికారంలో ఉన్నప్పుడు ఢిల్లీలో నిరంతరం అన్ని రాష్ట్రాల కాంగ్రెస్ నేతల హడావిడి ఎక్కువగా ఉండేది. ప్రతి పార్టీ ప్రధాన కార్యదర్శి చుట్టూ రాష్ట్రాల నేతలు తిరిగేవారు. టికెట్ కోసం ఢిల్లీలో నేతల చుట్టూ ఎలా తిరగాల్సి వచ్చేదో ఇటీవల మాజీ కాంగ్రెస్ నేత గల్లా అరుణకుమారి తన ఆత్మకథలో రాశారు. ఒక నాయకుడు తానిచ్చిన కాగితాలు క్రింద విసిరికొట్టారని చెప్పారు. రాష్ట్ర సీనియర్ నేతల అంతర్గత రాజకీయాలు తన పుస్తకంలో స్పష్టంగా వివరించారు. కాంగ్రెస్ వివిధ రాష్ట్రాల్లో అధికారం కోల్పోయిన తర్వాత కూడా కాంగ్రెస్ ఢిల్లీ నాయకత్వం పనిచేసే తీరు మాత్రం మారలేదు. కాంగ్రెస్ కూడా ఇప్పటి బీజేపీ డబుల్ ఇంజన్ సర్కార్‌ను కోరుకున్నట్లే లాగే వివిధ రాష్ట్రాల్లో తామే అధికారంలో ఉండాలని కోరుకునేది. 'బండి ముందుకు సాగాలంటే రెండు ఎద్దులు ఉండాలి. ఆ విధంగా కాక ఒకటి ఎద్దు, మరొకటి ఒంటె, గాడిద, కంచర గాడిదో అయితే బండి ముందుకు సాగదు..' అని రాజీవ్ గాంధీ స్వయంగా చెప్పారు. ఇటీవల రాహుల్‌గాంధీ గుజరాత్‌లో కాంగ్రెస్ ముఖ్యనాయకులతో సమావేశమైన తర్వాత తమ పార్టీలో సగం మంది నాయకులకు పైగా బీజేపీకి కోవర్టులుగా పనిచేస్తున్నారని చెప్పారు. అయితే రాహుల్‌గాంధీ చెప్పిందేమీ కొత్త విషయం కాదు. కాంగ్రెస్ పార్టీలో కోవర్టు సంస్కృతి ఎప్పటి నుంచో ఉన్నది. అధికారంలో లేనప్పుడు కాంగ్రెస్ నేతలు తమ పనులకోసం అధికారంలో ఉన్న తమ ప్రత్యర్థి పార్టీతో అంటకాగిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. తెలంగాణలో కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు కొందరు కాంగ్రెస్ నేతలు ఇలాంటి ఆరోపణలు ఎదుర్కొన్నారు. దిగ్విజయ్‌సింగ్ ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా ఉన్న కాలంలో మధ్యప్రదేశ్‌లో చాలా మంది కాంగ్రెస్ నేతలు, ఆయన సోదరుడితో సహా బీజేపీలో చేరారు. 'ఇదేమిటి సార్..' అని అడిగినప్పుడు 'మరి వారంతా ఎలా బతకాలి? అధికారంలో లేనప్పుడు అధికారంలో ఉన్న పార్టీ నేతలతో చేతులు కలపడం అనేది మామూలే. మళ్లీ ఎన్నికలు వస్తున్నాయంటే ఒక విజిల్ వేస్తే వారంతా మళ్లీ మా పార్టీలోకి వస్తారు చూడండి..' అని నవ్వారు. ఆయన చెప్పిన విధంగా అయిదేళ్ల తర్వాత మళ్లీ దిగ్విజయ్‌సింగ్ సోదరుడితో పాటు బీజేపీలో చేరిన అనేకమంది కాంగ్రెస్ నేతలు మళ్లీ స్వంత పార్టీలోకి వచ్చారు. అయితే పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందన్న విశ్వాసం ఉన్నప్పుడే ఏ విజిల్ అయినా పనిచేస్తుంది. గుజరాత్‌లోనే కాదు, అనేక రాష్ట్రాల్లో నరేంద్రమోదీ ఇతర పార్టీల నేతల్ని ఎలా మచ్చిక చేసుకోవాలో, తన పార్టీని ఎలా విస్తరించాలో అన్న విషయంపై పట్టు సాధించారు. రాజకీయాల్లో అవసరాలు, ప్రయోజనాలు, ప్రలోభాలను అధిగమించి వ్యవహరించేవారు అరుదు. మొగల్స్, పోర్చుగీస్, డచ్, బ్రిటిష్ వారు దండయాత్రలు చేసి రాజ్యాలు కబళించినప్పుడు కూడా వారి అండకోసం స్థానిక రాజులు ప్రయత్నించిన

# ఈసీకి జ్ఞానోదయం ఎప్పుడు?




తటస్థతకు తిలోదకాలొదిలి అవకతవకలకు అసలైన చిరునామాగా మారిన ఎన్నికల సంఘం(ఈసీ) సిగ్గుపడాల్సిన విషయమిది. ఆరోపణలొచ్చినప్పుడూ, ఫిర్యాదులందినప్పుడూ మౌనంతోనో, దబా యింపుతోనో తప్పించుకోజూస్తున్న ఈసీపై సోమవారం పార్లమెంటు ఉభయసభలూ దద్దరిల్లాయి. మహారాష్ట్రలో వోటర్ల జాబితా అవకతవకలపై కాంగ్రెస్ ఆరోపణలు చేసి మూణ్ణెల్లవుతోంది. నెల క్రితం కూడా ఆ పార్టీ నాయకుడు రాహుల్‌గాంధీ మీడియా సమావేశంలో ఈసీపై అభియోగాలు మోపారు. అయిదు నెలల వ్యవధిలో కొత్తగా 39 లక్షలమంది వోటర్లు ఎలా పుట్టుకొచ్చారని ప్రశ్నించారు. అవి ఆధార రహితం, తప్పుదోవ పట్టించే అభాండాలని చెప్పటం తప్ప నిర్దిష్టంగా ఫలానా చోట ఏం జరిగిందో, వోటర్ల సంఖ్య పెరగటానికి కారణమేమిటో వివరించే ప్రయత్నం ఈసీవైపు నుంచి లేదు! అటు బెంగాల్‌లో ఈ మాదిరి అవకతవకలే బయటపడి ఆ సంస్థ పరువు బజారుపాలు చేశాయి. వోటర్ల జాబితా అవకతవకలతోపాటు నకిలీ వోటరు కార్డులు రాజ్యమేలుతున్నాయని తృణమూల్ ఫిర్యాదు చేస్తే మూడు నెలల్లో సరిచేస్తామన్న జవాబొచ్చింది. వెనువెంటనే దర్యాప్తు చేసి దీనివెనక జరిగిందేమిటో తేల్చిచెప్పడానికి బదులు సరిచేస్తామనటంలో మర్మమేమిటి? అక్కడే కాదు... హరియాణా, గుజరాత్, ఒడిశా, యూపీల్లో సైతం ఇలాగే జరిగిందని విపక్ష సభ్యులు ఆరో పించారు. ఇటీవల ఎన్నికలు జరిగిన ఢిల్లీలోనూ ఇదే తంతు నడిచిందని ఆప్ ఆరోపణ. రాజ్యాంగ సంస్థగా ఎంతో హుందాగా, నియమ నిబంధనలకు లోబడి పనిచేయాల్సిన సంస్థ ఇలా అడుగడు గునా కంతలతో, లోపాయికారీ వ్యవహారాలతో ఎన్నికలు జరిపించటం సిగ్గుచేటు కాదా? ప్రజాస్వామ్యంలో ఎన్నికల నిర్వహణ నిష్టగా నిర్వహించాల్సిన క్రతువు. అది కాస్తా ఈమధ్య కాలంలో నవ్వుల పాలవుతున్న వైనం కనబడుతున్నా తనకేం సంబంధం లేనట్టు ఆ సంస్థ ప్రవర్తి స్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో నిరుడు ఎన్నికల సందర్భంగా కేంద్రంలోని అధికార ఎన్డీయే కూటమితో కొత్తగా చుట్టరికం కుదిరిందన్న ఏకైక కారణంతో అప్పటి విపక్ష నాయకులు చెప్పినట్టల్లా అధికారు లను బదిలీలు చేశారు. పర్యవసానంగా ఇతర జిల్లాల్లో జరిగిన దారుణ ఉదంతాల సంగతలా ఉంచి పల్నాడు ప్రాంతం ఎంతటి హింసను చవిచూసిందో, ఎన్ని గ్రామాల ప్రజలు ఇళ్లూ వాకిళ్లూ వదిలి ప్రాణభయంతో పారిపోయారో మీడియా సాక్షిగా వెల్లడైంది. పోలింగ్ కేంద్రాల దురాక్రమణ, తెల్లారుజాము వరకూ పోలింగ్ తంతు కానివ్వటం వంటి అరాచకాలకు అంతులేదు. సాయంత్రం గడువు ముగిసే సమయానికి పోలింగ్ కేంద్రం గేట్లు మూసి ఆ ఆవరణలో ఉన్నవారికి మాత్రమే స్లిప్‌లిచ్చి వోటు వేయటానికి అనుమతించాలని నిబంధనలు చెబుతున్నాయి. క్యూలో చిట్టచివర గేటు దగ్గర ఉన్నవారికి ఒకటో నంబర్ స్లిప్ ఇవ్వటంతో మొదలెట్టి బూత్ సమీపంలో ఉన్నవారికి ఆఖరి స్లిప్ ఇవ్వాలి. ఓటేశాక ఆ స్లిప్‌లు భద్రపరచాలి. సీసీ టీవీ ఫుటేజ్‌లు భద్ర పరచాలి. ఇదంతా జరిగిందా? పోలింగ్ ముగిసిన నాలుగురోజుల తర్వాత 12.5 శాతం వోటింగ్ పెరిగినట్టు చూప టానికి ఈసీ ఏమాత్రం మొహమాట పడలేదు. ఇదంతా ఎక్కడ బయటపడుతుందోనన్న కంగా రుతో పరాజితులు న్యాయస్థానాన్ని ఆశ్రయించే సమయానికే ఈవీఎంల డేటా ఖాళీ చేశారు. వీవీప్యాట్ స్లిప్‌లు ధ్వంసం చేశారు. ఈవీఎంలలో రికార్డయిన ఓట్ల లెక్కలు బయటకు తీసి, అవి వీవీప్యాట్ స్లిప్‌లతో సరిపోల్చాలని కోరితే డమ్మీ గుర్తులతో కొత్తగా నమూనా వోటింగ్ నిర్వహించ టానికి సిద్ధపడ్డారు! ఇక భద్రపరిచిన ఈవీఎంలలో చార్జింగ్ ఎలా పెరుగుతుందో ఇంతవరకూ చెప్పలేకపోయింది. వీటిపై వైఎస్సార్ కాంగ్రెస్ నిలదీస్తే జవాబివ్వటానికి ఈసీకి నోరు పెగలదు. పార్లమెంటులో ఇంత దుమారం రేగాక డూప్లికేట్ కార్డులపైనా, వోటర్ల జాబితా అవకతవక లపైనా సాధికారికంగా, పద్ధతిగా జవాబివ్వడానికి బదులు వేరే మార్గం ఎంచుకుంది. 'ఈసీ వర్గాలు' అనే పేరుతో ఒక వివరణ బయటికొదిలింది. ఆ సంస్థ తనను తాను ఏమనుకుంటున్నదో గానీ ఇలా మీడియాకు లీకులివ్వటం మర్యాదైన సంగతి కాదు. ఒక పార్టీయో లేదా ప్రభుత్వమో తమ ఆలోచనలపై ప్రజాస్పందనేమిటో తెలుసుకోవటానికి లీకులిస్తుంటాయి. దాని ప్రయోజనం దానికుంటుంది. కానీ ఈసీ అలా చేయటంలో ఆంతర్యమేమిటి? ఉదాహరణకు డూప్లికేట్ వోటర్ కార్డులు వారసత్వపు సమస్యగా తేల్చిచెప్పింది. 2008%-%13 మధ్యే ఈ కార్డులు జారీ అయ్యాయన్నది. అదే నిజమనుకుంటే ఆ సంగతి ఈసీకి ఎప్పుడు తెలిసింది? తెలిశాక తీసుకున్న చర్యలేమిటి? ఇన్నాళ్లూ సరిచేయక పోవటానికి కారణాలేమిటి? అధికారికంగా ఇలాంటి తెలివితక్కువ జవాబు లిస్తే మరిన్ని ప్రశ్నలు వచ్చిపడతాయన్న భయంతోనే ఆ సంస్థ లీకులతో సరిపెట్టింది. ఎంతకాలం ఈ దాగుడుమూతలు? ఎన్నాళ్లు ఈ అవకతవకలు? ఎన్నికల ప్రక్రియపైనా, వివిధ దశల్లో చోటుచేసుకున్న అక్రమాలపైనా ఫిర్యాదులొస్తే నిమ్మకు నీరెత్తినట్టు కూర్చుని ఇప్పుడు పార్లమెంటులో పెద్ద రాద్ధాంతం జరిగాక లీకులివ్వటం, అవి మరిన్ని సందేహాలకు తావీయటం అప్రదిష్ట కాదా? ఇందువల్ల తమ విశ్వసనీయత దెబ్బతింటుందన్న ఇంగితజ్ఞానం కూడా లేదా? ఓడిన రాజకీయ పార్టీలు మాత్రమే కాదు... సాక్షాత్తూ ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా పనిచేసిన ఎస్‌వై ఖురేషీ సైతం గతంలోనూ, ఇప్పుడూ కూడా అనేక ప్రశ్నలు లేవనెత్తారు. ఎన్నికల సంఘం తీరు సవ్యంగా లేదన్న అభిప్రాయం ప్రజల్లో బలపడుతున్నదని హెచ్చరించారు. కనుక ఆ సంస్థ ఇప్పటికైనా పారదర్శకతతో వ్యవహరించటం నేర్చుకోవాలి. తప్పును తప్పుగా ఒప్పుకొనే నిజాయితీ ప్రదర్శించాలి. లేనట్టయితే ప్రజానీకం

# ఇన్ఫోసిస్ వర్క్ ఫ్రమ్ హెూమ్: కొత్త రూల్‌పై కన్ఫ్యూజన్..




దేశీయ ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ ఇటీవల వర్క్ ఫ్రమ్ హెూమ్ .. ఆఫీస్ హాజరుకు సంబంధించిన కొత్త రూల్ జారీ చేసింది. తమ ఉద్యోగులు నెలలో కనీసం 10 రోజులు ఆఫీసుకు హాజరుకావాలని కొత్త నిబంధనను అమల్లోకి తెచ్చిన నేపథ్యంలో అదనపు వర్క్ ఫ్రమ్ హెూమ్ రోజులు అవసరమయ్యే ఉద్యోగులు గందరగోళంలో ఉన్నారు. దీనికి సంబంధించి ఇన్ఫోసిస్ స్పష్టత ఇచ్చింది.

### ఉద్యోగుల్లో గందరగోళం

ఒక ఉద్యోగి నెలలో కనీసం 10 రోజులు ఆఫీసు నుండి పనిచేయకపోతే "సిస్టమ్ ఇంటర్వెన్షన్"కు దారితీస్తుందని కంపెనీ ప్రకటించింది. అయితే ఈ పదం వాడకం ఉద్యోగుల్లో ఆందోళనకు దారితీసింది. ఏదైనా అత్యవసర కారణం లేదా ఉన్నతాధికారుల అనుమతితో వర్క్ ఫ్రమ్ హెూమ్ తీసుకుంటే, అది యాప్‌లో నమోదు కాకపోతే తమ సెలవు కోతకు గురవుతుందని ఉద్యోగులు ఆందోళన పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఎంప్లాయి యాప్ పై స్పష్టత వచ్చింది.

### మేనేజర్ అప్రూవల్ తప్పనిసరి

ఇన్ఫోసిస్ ఉద్యోగులు తమ హాజరును యాప్‌లో నమోదు చేస్తారు. వర్క్ ఫ్రమ్ హెూమ్ రిక్వెస్ట్‌లను ఈ యాప్ ఇకపై నేరుగా ఆమోదించదు. ఉద్యోగులు తప్పనిసరిగా తమ కార్యాలయంలో నెలకు 10 రోజులు హాజరు పంచ్ చేయాల్సి ఉంటుందని ఒక సీనియర్ ఎగ్జిక్యూటివ్‌ను ఉటంకిస్తూ ఎకనమిక్స్ టైమ్స్ కథనంలో పేర్కొంది. ఒక నెలలో అందుబాటులో ఉన్న మొత్తం వర్క్ ఫ్రమ్ హెూమ్ రోజుల సంఖ్య, ఇప్పటికే ఉపయోగించిన రోజులు, అందుబాటులో ఉన్న రోజులను యాప్ చూపిస్తుంది. అదనపు డబ్ల్యూఎఫ్‌హెచ్ రోజులను మినహాయింపుగా చూపిస్తామని, వాటిని క్రమబద్ధీకరించడానికి ఉద్యోగి తన మేనేజర్‌కు అప్రూవల్ రిక్వెస్ట్‌ను సమర్పించాల్సి ఉంటుందని యాప్‌లో అప్డేట్ చెబుతోంది. దేశంలోనే రెండో అతిపెద్ద ఐటీ సంస్థ అయిన ఇన్ఫోసిస్‌లో ప్రపంచవ్యాప్తంగా కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఈ కంపెనీలో సుమారు 3,23,000 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. అదనపు వర్క్ ఫ్రమ్ హెూమ్ రిక్వెస్ట్‌ను ఆమోదించే లేదా తిరస్కరించే విచక్షణను మేనేజర్లకు ఇవ్వడంపైనా ఉద్యోగులు ఆందోళన వెలిబుచ్చుతున్నారు.

అమల్లోకి కొత్త హైబ్రిడ్ విధానం


ఇన్ఫోసిస్ కొత్త హైబ్రిడ్ విధానం మార్చి 10 నుంచి అమల్లోకి వచ్చింది. వర్క్ ఫ్రమ్ హెూమ్ కోసం దరఖాస్తు చేసుకునే రోజుల సంఖ్యను పరిమితం చేస్తున్నట్లు, నెలలో కనీసం 10 రోజులు లేదా వ్యాపార అవసరాలకు అనుగుణంగా ఆఫీసు నుండి పనిచేయాలని కంపెనీ ఫంక్షనల్ హెడ్స్ గత వారం ఒక ఇ-మెయిల్లో ఉద్యోగులకు తెలియజేశారు. ఈ కమ్యూనికేషన్ జాబ్ లెవల్ 5 (%జీ%5) అంతకంటే తక్కువ స్థాయి ఉద్యోగులకు వర్తిస్తుంది.

# దేశంలో టెలికాం యూజర్ల సంఖ్య ఎంతో తెలుసా..

## ట్రాయ్ డిసెంబర్ నివేదికలో వెల్లడి

న్యూఢిల్లీ: దేశీయంగా డిసెంబర్‌లో మొత్తం టెలిఫోన్ సబ్‌స్క్రయిబర్స్ సంఖ్య గతంలో కంటే స్వల్పంగా పెరిగి 118.99 కోట్లకు చేరింది. నవంబర్‌లో ఇది 118.71 కోట్లుగా నమోదైంది. టెలికం రంగ నియంత్రణ సంస్థ ట్రాయ్ విడుదల చేసిన నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. దీని ప్రకారం ఇటు మొబైల్, అటు ఫిక్స్‌డ్ లైన్ విభాగాల్లో జియో పెద్ద సంఖ్యలో కొత్త యూజర్లను దక్కించుకుంది. వైర్‌లెస్ యూజర్ల విభాగంలో, రిలయన్స్ జియోకి నికరంగా 39.06 లక్షలు, భారతి ఎయిర్‌టెల్‌కు 10.33 లక్షల మంది కొత్తగా జత కాగా వొడాఫోన్ 17.15 లక్షల మందిని కోల్పోయింది. బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్ వరుసగా 3.16 లక్షలు, 8.96 లక్షల మంది సబ్‌స్క్రయిబర్స్‌ను కోల్పోయాయి. ఈ విభాగంలో ప్రైవేట్ సంస్థల మార్కెట్ వాటా 91.92 శాతంగా ఉండగా, ప్రభుత్వ రంగ బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్ వాటా కేవలం 8.08 శాతంగా ఉంది. మరోవైపు, వైర్‌లైన్ యూజర్ల సంఖ్య నవంబర్‌లో 3.85 కోట్ల నుంచి డిసెంబర్‌లో 3.92 కోట్లకు చేరింది. జియోకి 6.56 లక్షల మంది, భారతి ఎయిర్‌టెల్‌కు 1.62 లక్షలు, టాటా టెలీకి 9,278 మంది యూజర్లు జతయ్యారు. బీఎస్ఎన్ఎల్ ఏకంగా 33,306 యూజర్లను, ఎంటీఎన్ఎల్ 14,054 మంది సబ్‌స్క్రయిబర్స్‌ను కోల్పోయాయి.

మొత్తం బ్రాడ్‌బ్యాండ్ యూజర్లు నవంబర్‌లో 94.47 కోట్లుగా ఉండగా, డిసెంబర్‌లో 94.49 కోట్లకు చేరింది. రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ సబ్‌స్క్రయిబర్స్ 47.65 కోట్లుగా, భారతి ఎయిర్‌టెల్ యూజర్లు



28.93 కోట్లు, వొడాఫోన్ ఐడియా 12.63 కోట్లు, భారత్ సంచార్ నిగమ్ 3.53 కోట్లు, ఎట్రియా కన్వర్జెన్స్ టెక్నాలజీస్ యూజర్లు 22.7 లక్షల మంది ఉన్నారు. బ్రాడ్‌బ్యాండ్ మార్కెట్లో 50.43 శాతం వాటాతో జియో అగ్రస్థానంలో ఉండగా, భారతి ఎయిర్‌టెల్ (30.61 శాతం), వొడాఫోన్ ఐడియా (13.37 శాతం) తర్వాత స్థానాల్లో ఉన్నాయి.

# మారుమూల ప్రాంతాల్లో ఇంటర్నెట్.. స్టార్‌లింక్‌తో జియో ఒప్పందం

శాటిలైట్ ఆధారిత బ్రాడ్‌బ్యాండ్ ఇంటర్నెట్ సేవలను భారతదేశంలో ప్రవేశపెట్టడానికి రిలయన్స్ జియో ప్లాట్‌ఫామ్స్ లిమిటెడ్ (జేపీఎల్) ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కుదుర్చుకున్నట్లు ప్రకటించింది. ఈ సహకారం డిజిటల్ అంతరాన్ని పూడ్చడంలో దేశవ్యాప్తంగా, ముఖ్యంగా మారుమూల, సరైన డిజిటల్ కనెక్టివిటీలేని ప్రాంతాల్లో కమ్యునికేషన్ సేవలను అందించేందుకు తోడ్పడుతుందని నమ్ముతున్నారు. ఇప్పటికే ఎయిర్‌టెల్ కూడా దేశంలోని తన వినియోగదారులకు స్టార్‌లింక్ సేవలు అందించేందుకు స్పేస్‌ఎక్స్‌తో ఒప్పందం చేసుకుంది. భారత్‌లో స్టార్‌లింక్ సేవలు ప్రారంభం కావాలంటే రెగ్యులేటరీ అనుమతులు అవసరమవుతాయి. అందుకోసం కంపెనీ ట్రాయ్ వద్ద అనుమతులకు అవసరమైన పత్రాలు దాఖలు చేసింది. దీనిపై తుని నిర్ణయం వెలువడకుముందే దేశీయ టెలికాం కంపెనీలు స్పేస్‌ఎక్స్‌తో భాగస్వామ్యం కుదుర్చుకోవడం దేశంలోని అన్ని ప్రాంతాల్లోని కస్టమర్లకు మెరుగైన కనెక్టివిటీని అందించేందుకు చేస్తున్న కృషిని హైలైట్ చేస్తుంది. జియో ఫైబర్, జియోఎయిర్ ఫైబర్ వంటి ప్రస్తుత బ్రాడ్‌బ్యాండ్ సర్వీసులను స్టార్‌లింక్ భర్తీ చేయనుంది. సాంప్రదాయ ఫైబర్ నెట్‌వర్క్‌లు విస్తరించే అవకాశం ఉన్న ప్రాంతాలకు హైస్పీడ్ ఇంటర్నెట్‌ను అందించడం ఈ భాగస్వామ్యం లక్ష్యంగా పెట్టుకుంది. విస్తృతమైన రిటైల్ నెట్‌వర్క్, ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా స్టార్‌లింక్ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని జియో యోచిస్తోంది. అందుకు అవసరమైన ఇన్‌స్టలేషన్, యాక్టివేషన్, సర్వీస్ అవసరాలకు అనుగుణంగా కస్టమర్ సపోర్ట్ సిస్టమ్‌ను ఏర్పాటు చేస్తుంది. వినియోగదారులకు సరసమైన, విశ్వసనీయమైన బ్రాండ్‌బ్యాండ్ కనెక్టివిటీని అందించేందుకు ఈ చర్యలు చేపడుతున్నట్లు కంపెనీ పేర్కొంది. రిలయన్స్ జియో గ్రూప్ సీఈఓ మాథ్యూ వోమెన్ ఈ భాగస్వామ్యంపై స్పందిస్తూ..'జియో బ్రాండ్‌బ్యాండ్ ఎకోసిస్టమ్‌లో స్టార్‌లింక్‌ను అనుసంధానించడం ద్వారా కనెక్టివిటీని విస్తరిస్తున్నాం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత యుగంలో హై-స్పీడ్ బ్రాండ్‌బ్యాండ్ అవకాశాలను పెంచుతున్నాం' అన్నారు. స్పేస్‌ఎక్స్ ప్రెసిడెంట్, సీఓఓ గ్విన్ షాట్వెల్ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ భారతదేశ డిజిటల్ కనెక్టివిటీని విస్తరించడానికి జియోతో కలిసి పనిచేయడం పట్ల ఉత్సాహంగా ఉన్నట్లు తెలిపారు.

**ఇదీ చదవండి: ఎస్‌బీఐ యూపీఐ సేవల్లో**

**అంతరాయం**

### షరతులకు అంగీకారం

దేశంలో శాటిలైట్ బ్రాడ్‌బ్యాండ్ సేవలకు సంబంధించిన షరతులను స్టార్‌లింక్ అధికారికంగా ఇప్పటికే అంగీకరించింది. ఈ సేవలు ప్రారంభించేందుకు అవసరమైన లైసెన్స్ పొందడానికి భారత ప్రభుత్వం విధించిన నియమాలకు కట్టుబడి ఉంటానని తెలిపింది. స్టార్‌లింక్ భారత్‌లో ప్రవేశించేందుకు ఇది కీలక పరిణామమని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. దేశంలోని మారుమూల ప్రాంతాలకు హైస్పీడ్ ఇంటర్నెట్ సదుపాయాన్ని అందించాల.

# పునర్విభజన అవసరమా?

భారత్‌కు ఇప్పుడు అవసరమైనది ఏమిటి? లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన. ఎంత మాత్రం కాదు. ప్రభుత్వమూ, ప్రజలు ఆలోచించాల్సిన విషయాలలో అది ఆఖరిది అవడం మంచిది. ఆ పునర్విభజన ప్రక్రియన మరో 30 సంవత్సరాల పాటు వాయిదా వేయాలని కోరుతూ తమిళనాడులో అఖిలపక్ష సమావేశం ఒక తీర్మానాన్ని ఆమోదించింది. కేవలం ఒక రాష్ట్రం లేదా ఒక ప్రాంత ప్రయోజనాలను కాపాడుకునే నిమిత్తం ఆమోదించిన తీర్మానం కాదు అది. జాతీయ సమైక్యతను మరింత పటిష్ఠం చేసేందుకు ఉద్దేశించిన తీర్మానమది. లోక్‌సభా సీట్ల పునః కేటాయింపును శాశ్వతంగా నిలిపివేయడమే భారత్ సమైక్యతను కాపాడుతుంది. దేశ సమైక్యతకు ఎదురయ్యే సవాళ్లనన్నిటినీ సమర్థంగా ఎదుర్కొనేందుకు పునర్విభజన నిలిపివేత దోహదం చేస్తుంది. భారత గణతంత్ర రాజ్య సంస్థాపనలో అంతర్ గర్భితంగా ఉన్న 'సమాఖ్య ఒప్పందం'ను గౌరవించేందుకు ఉత్తమ మార్గం లోక్‌సభా సీట్ల ప్రస్తుత కేటాయింపును ఎటువంటి మార్పు లేకుండా యథాతథంగా కొనసాగించడమేబీ రాజ్యాంగ నిర్మాతలు నిర్దేశించిన అధికార %-%భాగస్వామ్య ఒప్పందాన్ని అనుల్లంఘనీయమైనదిగా పరిగణించాలి. దానిపై పునరాలోచన ఎంతమాత్రం అవసరం లేదు. పునర్విభజనను వ్యతిరేకిస్తున్నవారు ఆ ప్రక్రియను శాశ్వతంగా నిలిపివేయాలని కోరడం లేదు. వారు ఒక పరిమిత, లోపభూయిష్ట వాదన చేస్తున్నారు. 'జనాభా నియంత్రణ'లో కొన్ని రాష్ట్రాల సంపూర్ణ విజయాలు, మరికొన్ని రాష్ట్రాల వైఫల్యాల ప్రాతిపదికన చేస్తున్న వాదన అది. రాజ్యాంగంలో అంతస్సూచితమైన, అయితే అనుల్లంఘనీయమైన 'సమాఖ్య ఒప్పందం' భావన భారతీయుల చర్చల్లో ప్రస్తావనకే రావడం లేదు. మన గణతంత్ర రాజ్యం ఏర్పాటై 75 సంవత్సరాలు గడచిన తరువాత ఇప్పుడు సమాఖ్య ఒప్పందం గురించి ఆలోచించడమెందుకు?సమస్యను స్పష్టంగా అర్థం చేసుకుందాం. వర్తమాన చర్చ, ప్రస్తుత వాదన నియోజకవర్గాల తాజా పునర్విభజనకు సంబంధించిన రెండు అంశాలలో ఒకదానికే పరిమితమయింది. నియమానుసారం పార్లమెంటరీ నియోజకవర్గాల సరిహద్దులను మార్చి వేయడంపై ఎవరికీ ఆక్షేపణ లేదు. ఒక రాష్ట్ర పరిధిలోని లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల సరిహద్దులను మార్చివేయడం లేదా అసెంబ్లీ స్థానాల సంఖ్యను పెంచడం సమాఖ్య సమతౌల్యతను ప్రభావితం చేయవు. అసలు సమస్యేమిటంటే వివిధ రాష్ట్రాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజనను చేపట్టడమే. యాభై సంవత్సరాల క్రితం రాష్ట్రాలకు కేటాయించే నియోజకవర్గాల సంఖ్యను నిర్ణయించారు. ఆ సంఖ్యను కొనసాగించాలా? లేక మార్చాలా? లేక ఎప్పటికీ యథాతథంగా కొనసాగించాలా? ఈ అంశాలపై నిశిత, నిష్పాక్షిక చర్చ జరగాలి.జనాభా గణన అనంతరం విధిగా జరిగే నియోజక వర్గాల పునర్విభజన 'ఒక వ్యక్తి, ఒక ఓటు, ఒకే విలువ' అన్న సూత్రం ప్రాతిపదికన జరగాలని రాజ్యాంగ నిబంధన పేర్కొంది. లోక్‌సభకు ఎన్నికయ్యే ప్రతి సభ్యుడు ప్రాతినిధ్యం వహించే ఓటర్ల సంఖ్య సమానంగా ఉండి తీరాలని 'ఒక వ్యక్తి, ఒక ఓటు, ఒకే విలువ' అనే ప్రజాస్వామిక సూత్రం నిర్దేశిస్తుంది. ఈ సూత్రం ఉల్లంఘనకు గురైతే పెద్ద నియోజకవర్గాలలోని ఓటు విలువ చిన్న నియోజకవర్గాలలోని ఓటు విలువ కంటే తక్కువగా ఉంటుంది. ఉదాహరణకు యూపీలో 32 లక్షల మంది ప్రజలకు లోక్‌సభలో ఒక ఎంపీ ఉండగా కేరళలో 18 లక్షల కంటే తక్కువ మందికి లోక్‌సభలో ఒక ఎంపీ ఉన్నాడు. దీనివల్ల కేరళలో ఒక ఓటరుకు, యూపీలోని ఒక ఓటర్ కంటే రెట్టింపు ప్రాధాన్యముంటుంది. మరింత స్పష్టంగా చెప్పాలంటే జనాభాకు, లోక్‌సభ సభ్యుల సంఖ్యకు గల నిష్పత్తి సాధ్యమైనంతవరకు అన్ని రాష్ట్రాలకు ఒకేవిధంగా ఉండాలి. మరి అలా ఉన్నదా? లేదు. కనుక ఈ అసంబద్ధతను తొలగించాల్సి ఉన్నది. అయితే చిన్న రాష్ట్రాల విషయంలో రాజ్యాంగం ప్రకారమే ఈ సూత్రం వర్తించదు. ఇందుకు రాజ్యాంగమే వెసులుబాటు కల్పించింది జనాభాలో తమ వాటా కంటే లోక్‌సభలో ఎక్కువమంది ప్రతినిధులను కలిగి ఉండే హక్కు చిన్న రాష్ట్రాలకు రాజ్యాంగం కల్పించింది. ఇటువంటి పరిస్థితులలో 'అసౌష్ఠవ సమాఖ్య విధానం' అమలులో ఉండేందుకు సమాఖ్యలోని వివిధ రాష్ట్రాలకు ప్రత్యేక రాజ్యాంగ విహిత రక్షణలు కల్పించారు.జనాభాకు, లోక్‌సభ సభ్యుల సంఖ్యకు గల నిష్పత్తి సాధ్యమైనంతవరకు అన్ని రాష్ట్రాలకు ఒకే విధంగా ఉండాలన్న నిబంధనకు (కొన్ని రాష్ట్రాల విషయంలో) ఇచ్చిన మినహాయింపును ఇప్పుడు ఒక సాధారణ సూత్రంగా పాటించాలి, రాజ్యాంగ నిర్మాతలు చూడలేకపోయిన, ఊహించలేకపోయిన పరిస్థితులను పరిగణనలోకి తీసుకుంటే ఆ 'సాధారణీకరణ' ఆవశ్యకత అర్థమవుతుంది. ఇదేమీ జనాభా నియంత్రణ విధాన సాఫల్య వైఫల్యాలకు సంబంధించినది కాదు. జననాల, మరణాల రేట్లు జనసంఖ్యా సంబంధి మార్పులకు అనుగుణంగా ఉంటాయి. ఆర్థికంగా అభివృద్ధి చెందిన రాష్ట్రాలు లేదా సామాజిక సమూహాలు జనాభా పెరుగుదల శీఘ్రగతిన నిలిచిపోవడం కద్దు. అదొక సహజ పరిణామం.భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన తరువాత జాతి జీవనంలో విభేదాలు, అనైక్యతలు తీవ్రమయ్యాయి. సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ రంగాలు మూడింటిలోనూ ఈ విపరిణామాలు చోటుచేసుకున్నాయి, సంలీనమవుతున్నాయి. ఈ పతన ప్రక్రియ గత మూడు దశాబ్దాలలో మరింత వేగవంతమయింది. ఈ నేపథ్యంలో తాజా నియోజకవర్గాల పునర్విభజన ద్వారా రాష్ట్రాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు లోక్‌సభ సీట్ల పునఃకేటాయింపు ఆ విభేదాలు, అనైక్యతలకు దోహదం చేసే మరొక ప్రమాదకర అంశమవుతుంది. ఇది జాతీయ సమైక్యతా స్ఫూర్తిని మరింతగా బలహీనపరుస్తుంది. భారతదేశ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఇప్పటికే ఉన్న సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ అంతరాలు, అనైక్యతలను తొలగించేందుకు తక్షణ కృషి జరగాలి. ఈ దృష్ట్యా నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను పూర్తిగా నిలిపివేయాలి.హిందీ భాష మాట్లాడే రాష్ట్రాలు, హిందీయేతర, ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల మధ్య సాంస్కృతిక వ్యత్యాసాలు నెలకొనివున్నాయి. ఈ తేడాలు మొదటి నుంచీ ఉన్నప్పటికీ దేశ విభజన అనంతరం బాగా పెరిగిపోయాయి. అయితే తొలి నాటి రాజకీయ నాయకులు భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు, హిందీని ఏకైక అధికార భాషగా ఉండకూడదన్న డిమాండ్‌ను అంగీకరించడం ద్వారా హిందీ, హిందీయేతర రాష్ట్రాల మధ్య సమైక్యతను సంరక్షించారు. గత మూడు దశాబ్దాలుగా దేశ ఆర్థిక వ్యవస్థలో చోటుచేసుకున్న మార్పులు దక్షిణ - పశ్చిమ భారత రాష్ట్రాలు, ఉత్తర, తూర్పు భారత రాష్ట్రాల మధ్య తీవ్ర అసమానతలను సృష్టించాయి. దేశ రాజకీయాలలో ఒక ప్రధాన శక్తిగా బీజేపీ ప్రభవించడం ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల సంబంధాలను ప్రభావితం చేస్తోంది. ఉత్తరాది రాష్ట్రాలలో బీజేపీ ఒక తిరుగులేని శక్తిగా ఉండగా ఇతర రాష్ట్రాలలో ముఖ్యంగా దక్షిణాదిన దాని ఉనికికి తీవ్ర పోటీ ఎదురవుతోంది.హిందీ, హిందీయేతర రాష్ట్రాల మధ్య సాంస్కృతిక వ్యత్యాసాలు, ఆర్థిక అసమానతలు, రాజకీయ అంతరాలను తొలగించని పక్షంలో దేశ సమైక్యతకు ముప్పు ఏర్పడుతుందనడంలో సందేహం లేదు.నియోజకవర్గాల పునర్విభజనతో వ్యత్యాసాలు, అసమానతలు, అంతరాలు మరింత తీవ్రమయ్యే అవకాశమున్నది. 2026 జనాభా గణన అనంతరం జనాభా ప్రాతిపదికన ప్రతి రాష్ట్రానికి లోక్‌సభ సీట్ల కేటాయింపు పర్యవసానాలు ఎలా ఉంటాయో మిలన్ వైష్ణవ్, జమియె హింట్సన్‌లు విశ్లేషించారు. ఈ విశ్లేషణ ప్రకారం దక్షిణాది రాష్ట్రాలు భారీగా నష్టపోతాయి. లోక్‌సభలో కేరళ, తమిళనాడు చెరొక ఎనిమిది సీట్లను కోల్పోతాయిబీ తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్‌లు కలిసికట్టుగా ఎనిమిది సీట్లను నష్టపోతాయిబీ కర్ణాటక రెండు సీట్లను కోల్పోతుంది. ఇతర హిందీయేతర రాష్ట్రాలలో పశ్చిమ బెంగాల్ నాలుగు సీట్లను, ఒడిషా మూడు సీట్లను, పంజాబ్ ఒక స్థానాన్ని కోల్పోతాయి. ఉత్తరాదిలో హిమాచల్, ఉత్తరాఖండ్‌లు ఒక్కొక్క సీటును కోల్పోతాయి. అయితే యూపీ అదనంగా 11 సీట్లను పొందుతుంది. బిహార్‌కు అదనంగా పది సీట్లు, రాజస్థాన్‌కు అదనంగా ఆరు సీట్లు, మధ్యప్రదేశ్‌కు అదనంగా నాలుగు సీట్లు లభిస్తాయి.ఆయా రాష్ట్రాలకు ఈ లాభనష్టాల వల్ల హిందీ, హిందీయేతర భాషా రాష్ట్రాల మధ్య ఉన్న సున్నితమైన సమతౌల్యత మరింతగా దెబ్బతింటుంది. ప్రస్తుతం లోక్‌సభలోని 543 స్థానాలలో 226 హిందీ భాషా రాష్ట్రాల్లో ఉన్నాయి. పునర్విభజన తరువాత వాటి సంఖ్య 259కి పెరుగుతుంది. ప్రస్తుతం 132 స్థానాలు ఉన్న దక్షిణాది రాష్ట్రాలు తూర్పు, పశ్చిమ రాష్ట్రాలతో కలిసి ఏదైనా కీలక రాజ్యాంగ సవరణను వీటో చేయగలిగే స్థితిలో ఉన్నాయి. పునర్విభజన అనంతరం వాటికి ఇటువంటి వెసులు బాటు ఉండదు. ఇది భారత గణతంత్ర రాజ్య సంస్థాపక సూత్రాల స్ఫూర్తికి విరుద్ధమైనది. భిన్నత్వంలో ఏకత్వం అనే భావనకు తీవ్ర విఘాత మేర్పడుతుంది. ఈ ప్రాథమిక సూత్రాలను గౌరవించడం అంటే మన రాజ్యాంగంలో అంతర్గతంగా ఉన్న ఒక సమాఖ్య ఒప్పందానికి ఒక ప్రాతిపదికను ఏర్పరచుకోవడమే అవుతుంది. మన సమాఖ్య, స్వతంత్ర రాష్ట్రాలు ఒక విశాల దేశాన్ని ఏర్పాటు చేయడానికి స్వచ్ఛందంగా కలిసిన రాజకీయ వ్యవస్థ కాదు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలతో అధికారంలో భాగస్వాములుగా ఉన్న సమాఖ్య రాజకీయ వ్యవస్థ మనది. ఈ కారణంగానే మన సమాఖ్య ఒప్పందం లిఖితపూర్వకంగా లేదు. అది రాజ్యాంగంలో సూచనప్రాయంగా మాత్రమే ఉన్నది. అయితే అదొక మౌలిక సూత్రం.ఈ సమాఖ్య ఒప్పందాన్ని అంగీకరించడమంటే రెండు వాదనలకు శాశ్వతంగా ముగింపు పలకడమే. అవి: జనాభా ఆధారిత రాజకీయ ప్రాతినిధ్యంబీ పన్నుల రాబడి ప్రాతిపదికన ఆర్థిక వనరులలో వాటా. హిందీభాషా రాష్ట్రాలు, హిందీయేతర భాషా రాష్ట్రాలు ఈ రెండు అంశాలలో ఒకదానితో లబ్ధి పొందగా మరొకదాని విషయంలో నష్టపోతాయి. ఎన్నికల ప్రయోజనాలను పక్కన పెట్టి ఈ సమాఖ్య ఒప్పందంపై జాతీయ ఏకాభిప్రాయాన్ని సాధించడం, భారత గణతంత్ర రాజ్యసంస్థాపక సూత్రమైన 'జస్ట్ రిపబ్లిక్'.

# విస్తరిస్తున్న ధూళి కాలుష్యం



మనం పర్వతాలను కొలుస్తాం. నదులను పూజిస్తాం. అడవులను ఆరాధిస్తాం. వాయువును దేవుడిగా భావిస్తాం. భూమిని తల్లిగా పిలుస్తాం. అదంతా మన సంస్కృతిలో భాగమేనని గొప్పగా చాటుకుంటాం. కానీ, కాలుష్యంలో మనం ప్రపంచంలోని ఐదు దుర్భర దేశాల్లో ఒకటిగా నిలవడం మన ఆచరణలోని డొల్లతనాన్ని ఎత్తి చూపుతున్నది. మన నిర్లక్ష్యానికి, ప్రకృతి విధ్వంసానికి నిలువెత్తు సాక్ష్యం లాంటి ఈ కఠోర సత్యాన్ని ప్రపంచ గాలి నాణ్యత నివేదిక (2024) బయటపెట్టింది. మన మాటలకు ఆచరణకు మధ్య ఏ మాత్రం సం బంధం లేదని ఇది తెలియజేస్తున్నది. మనకు గల ఎన్నో భ్రమలను ఈ నివేదిక పటాపంచలు చేసింది. 2024లో మన గాలిలో ధూళికణాల స్థాయి ఘనపు మీటరుకు 50.6 మైక్రో గ్రాములుగా నమోదైంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫారసు చేసిన స్థాయి కంటే ఇది పదింతలు పైగా ఉండటం గమనార్హం. స్విట్జర్లాండ్ వాయు నాణ్యతా సాంకేతిక సంస్థ ఐక్యూ ఎయిర్ మార్చి 11న విడుదల చేసిన ఈ నివేదికలో ఇంకా దిగ్భ్రాంతికరమైన అంశాలు ఎన్నో ఉన్నాయి. ప్రపంచ దేశాల్లో చాద్, బంగ్లాదేశ్, పాకిస్థాన్, కాంగో తర్వాత ఐదో స్థానంలో భారత్ ఉండటం ఏ రకంగానూ సమర్థనీయం కాదు. ప్రపంచంలోని 100 కాలుష్య భరిత నగరాల్లో 70 భారత్‌కు చెందినవే కావడం అందులో ఒకటి. పైగా అగ్రస్థానంలో ఉన్న నాలుగు నగరాల్లోనూ మనవి నాలుగు నగరాలున్నాయి. ఈశాన్యంలో ఇంకా కాలుష్యం జడలు విప్పుకోలేదని ఇంతవరకు మనం అనుకుంటున్నాం.మేఘాలయలోని ఓ సరస్సు అడుగు భాగం స్పష్టంగా కనిపించే స్ఫటిక సదృశంగా ఉంటుదని కథలు కథలుగా చెప్పుకొంటారు. కానీ పై నివేదిక ప్రకారం మేఘాలయలోని బిర్నిహాట్ ప్రపంచంలోని అత్యంత కాలుష్యపూరిత నగరాల్లో మొదటిస్థానంలో నిలవడం విస్మయం కలిగిస్తున్నది. అక్కడ వాయుధూళి కణాల స్థాయి 128.2గా నమోదైంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపిన పరిమితి కన్నా 25 రెట్లు అధికమన్న మాట. ఆ తర్వాతి స్థానంలో దేశ రాజధాని ఢిల్లీ నిలిచింది. ఇక్కడ ఆసక్తికరమైన అంశం ఏమంటే భారత్ ధూళి కాలుష్యం విషయంలో సొంత ప్రమాణాలు కలిగి ఉండటం. డబ్ల్యూహెచ్‌వో సిఫారసు చేసిన దానికంటే అది నాలుగింతలుగా ఉండటం ఏమిటి? కాలుష్యంపై ఖాతరులేని తనాన్ని ఇది సూచించడం లేదా? డాటా సేకరణలో ముందంజ సాధించినప్పటికీ ఆచరణలో వెనుకబడిపోవడం జరుగుతున్నదనేది వాస్తవం. జాతీయ స్వచ్ఛ వాయు కార్యక్రమం వంటి చర్యలు ప్రభుత్వం చేపడుతున్నప్పటికీ వాటి అమల్లో అవకతవకలు, మౌలిక యంత్రాంగం లోటుపాట్ల కారణంగా సవాళ్లు ఎదురవుతున్నాయని నివేదిక పేర్కొనడమే ఇందుకు నిదర్శనం. గ్యాస్ సిలిండర్ విషయమే తీసుకుంటే కట్టెల పొయ్యిలను తగ్గించడానికి ఉచిత గ్యాస్ సిలిండర్ పంపిణీ చేపట్టా రు. మొదటిది ఉచితమే కానీ, తదుపరి సిలిండర్లు కొనే స్థోమత లేక చాలామంది గృహిణులు మళ్లీ కట్టెల పొయ్యి వైపే మొగ్గడం తెలిసిం దే. అలాగని ప్రపంచ దేశాల పరిస్థితి ఏమంత ఆశావహంగా లేదు. 2024లో 17 శాతం నగరాలు మాత్రమే ప్రపంచ ఆరోగ్య సంస్థ పరిమితికి లోబడి ధూళికణాలు కలిగి ఉన్నాయి.పసిఫిక్ సముద్రంలో భాగమైన ఆస్ట్రేలియా, బహామాస్, బార్బడోస్, స్తోనియా, గ్రెనాడా, ఐస్‌ల్యాండ్ న్యూజీల్యాండ్ అనే ఏడు ఏషియానియా దేశాలు మాత్రమే ధూళి కణాల విషయంలో ఆరోగ్యకరమైన స్థాయిని కాపాడుకుంటున్నాయని నివేదిక తెలిపింది. కన్ను పసిగట్టలేనంత సూక్ష్మమైన ఈ ధూళికణాలు అత్యంత ప్రమాదకరమైనవి. నిర్మాణ, పారిశ్రామిక కార్యకలాపాలు, శిలాజ ఇంధనాల దహనం వల్ల ఇవి వాతావరణంలోకి విడుదల అవుతాయి. వీటివల్ల మనుషుల ఆరోగ్యానికి ముప్పు ఏర్పడుతుంది. ముఖ్యంగా శ్వాసకోశ సంబంధ వ్యాధులకు ఇవి కారణమవుతాయనేది తెలిసిందే. ఒక అంచనా ప్రకారం 2021లో 81 లక్షల మంది వాయు కాలుష్యం వల్ల ప్రాణాలు కోల్పోయారు. అందులో 58 శాతం మరణాలకు ధూళికణాలే కారణం. దీన్ని కేవలం ప్రాణనష్టం పరంగా మాత్రమే చూడలేం. ఆరోగ్య సంరక్షణ రంగంపై, తద్వారా ఆర్థిక రంగంపై వేసే ప్రభావం అపారమని గుర్తించాలి. ఇప్పుడే కాలుష్యం ఇంతగా ఉంటే రేపటి రోజున పరిస్థితి ఏమిటనేది ఆందోళన కలిగించక మానదు. పై నివేదిక భారత్‌తో సహా ప్రపంచ దేశాలకు ఓ మేలుకొలుపు కావాలి. కాలుష్యం అంతానికి ప్రపంచ దేశాలు దృఢదీక్షతో, చేయీ చేయీ కలిపి సమన్వయంతో కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. భావితరాల కోసమైనా ఆ పని చేయకతప్పదు.

# మితిమీరుతున్న నిర్బంధాలు!



అడ్డగోలు హామీలతో ప్రజలను బురిడీ కొట్టించి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది దాటింది. ప్రజలకు నచ్చేలా పాలన అందించడమే తమ లక్ష్యమని ఎన్నికల ప్రచారంలో పార్టీ నేతలు ఊదరగొట్టారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడమే ముఖ్యమన్నారు. తెలంగాణలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరిస్తామని ప్రగల్భాలు పలికారు. ప్రజల సమస్యలు పరిష్కరించడానికి రాష్ట్ర, నియోజక వర్గస్థాయుల్లో నిరంతరం ప్రజా దర్బార్లు ఏర్పాటు చేస్తామని గొప్పలు చెప్పారు. అధికారం చేజిక్కించుకోవడానికి 420 హామీలంటూ అరచేతిలో స్వర్గం చూపించారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేయడంతో పాటు ఏడో హామీగా ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరిస్తామని చెప్పారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఈ ఏడాదిన్నర కాలంలో ప్రజాస్వామ్యాన్ని అడుగడుగునా ఖూనీ చేస్తూ వస్తున్నారు. పదేండ్ల తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ బీఆర్ఎస్‌ను టార్గెట్ చేసుకొని కక్షపూరితంగా వ్యవహరిస్తున్నది. కాంగ్రెస్ పాలనతో విసుగుచెందిన ప్రజలు బీఆర్ఎస్‌పై చూపుతున్న ఆదరణను చూసి ఓర్వలేకపోతున్నది. దీంతో కేటీఆర్, హరీశ్‌రావులపై అక్రమ కేసులు పెడుతున్నది.ఫార్మా కంపెనీలను వ్యతిరేకిస్తున్న ప్రజల పక్షాన నిలిచిన పట్నం నరేందర్‌రెడ్డి లాంటి ప్రజా నాయకులను ఆక్కసుతో నిర్బంధించి, అక్రమ కేసుల్లో ఇరికించి జైలుపాలు చేశారు. అధికార పార్టీ హామీలపై బీఆర్ఎస్ నేతలు నిలదీస్తుంటే సమాధానం లేని కాంగ్రెస్ పార్టీ తన అనుచరులతో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాలపై దాడులు చేయిస్తున్నది.రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పాలనపై దృష్టి పెట్టకుండా కేసీఆర్ పేరును తుడిచిపెట్టడంపై దృష్టిసారించారు. కేసీఆర్ చేసిన అభివృద్ధి నమూనాకు ప్రత్యామ్నాయంగా ఎలాంటి అభివృద్ధి నమూనాను రూపొందించలేకపోయారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాల పేర్లు మారుస్తూ కాలయాపన చేస్తూ వచ్చారు. అసెంబ్లీ వేదికగా బీఆర్ఎస్ శాసనసభ్యులు అడిగిన ప్రశ్నలకు సూటిగా సమాధానం ఇవ్వకుండా మంత్రులే పొంతనలేని సమాధానాలు ఇచ్చిన తీరును తెలంగాణ సమాజమంతా గమనించింది.ప్రజాస్వామ్యబద్ధంగా చర్చకు అవకాశం లేకుండా వ్యక్తిగత దూషణలకు మంత్రివర్గం దిగిన తీరును తెలంగాణ ప్రజలందరూ గమనించారు. ఏ అంశం పైనా మంత్రులకు సంపూర్ణ అవగాహన లేదని అసెంబ్లీ వేదికగా స్పష్టమైంది. అసెంబ్లీలో ముఖ్యమంత్రి చిల్లర భాష తెలంగాణ సమాజాన్ని విస్మయానికి గురిచేసింది. ఈ ఏడాది కాలంలో కేసీఆర్ పేరు ఎత్తకుండా రేవంత్‌రెడ్డి ప్రసంగం ముందుకు సాగిన దాఖలాలు లేవు. చర్చ మొత్తం గతం గురించి ప్రస్తావించడం తప్ప వర్తమానం గురించి ఊసే లేకుండా పోయింది. గ్రామ సభల్లో అధికార పార్టీ ప్రజాప్రతినిధులకు ప్రజలు ముచ్చెమటలు పట్టిస్తున్నారు. ఏడాదిలో మూడుసార్లు వినతులు స్వీకరించి ఒరగబెట్టింది ఏమిటని నిలదీస్తున్నారు. సంక్షేమ పథకాలు అందని ప్రజలు ప్రశ్నిస్తుంటే అరకొరగా హాజరైన కాంగ్రెస్ ప్రజా ప్రతినిధుల నుంచి సమాధానం లేకుండా పోతున్నది. దీంతో గ్రామ సభలు నిరసన వేదికలుగా మారుతున్నాయి.ముళ్ల కంచెలు తొలగిస్తాం.. ప్రజా ఉద్యమాలపై ఆంక్షలు ఎత్తేస్తామని చెప్పిన రేవంత్ సర్కార్ అడుగడుగునా ఆంక్షలు, నిర్బంధాలు, వేధింపులకు గురిచేస్తున్నది. బీఆర్ఎస్ పదేండ్ల కాలంలో రైతుల పక్షపాతిగా వ్యవహరించి, రైతును రాజు చేసింది. కాంగ్రెస్ మాత్రం రైతుబంధుకు పంగనామాలు పెట్టింది. రుణమాఫీ అరకొరగా చేసింది. రైతులు ధర్నాకు పిలుపునిస్తే అనుమతులు నిరాకరిస్తున్నారు. ఫ్లెక్సీలు చించివేస్తున్నారు. దాడులు చేస్తున్నారు. సభలు, సమావేశాలు పెట్టుకోవాలన్నా, ధర్నా చేయాలన్నా న్యాయస్థానాన్ని ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొన్నది. బీఆర్ఎస్ ఇప్పటి వరకు చేపట్టిన ధర్నాలన్నీ న్యాయస్థానం అనుమతితో చేసినవే కావడం గమనార్హం. తాజాగా, రైతుబంధు రాలేదన్న రైతు వీడియోను ప్రసారం చేసినందుకు ఇద్దరు మహిళా జర్నలిస్టులు రేవతి, తన్వీలను పోలీసులు అరెస్ట్ చేశారు. నియోజకవర్గాలకు మంత్రులు వచ్చినా, ముఖ్యమంత్రి వచ్చినా బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలను పోలీసులు నిర్బంధిస్తున్నారు. ప్రజా సం ఘాల నేతలను సైతం అక్రమంగా అదుపులోకి తీసుకుంటున్నారు. ఫార్మా కంపెనీలను వ్యతిరేకించిన లగచర్ల రైతులపై లాఠీ లు ఝుళిపించారు. ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాటంలో భాగమైన ప్రజలపై నిర్బంధకాండను కొనసాగించారు. ప్రజాస్వామ్య సంస్కృతికి పాడె కడుతున్నారు.

# గౌరవ శాసనసభకు విన్నపం



మా పొట్టలు కొట్టొద్దు ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసే పీఎంశ్రీ పథకాన్ని, మొబైల్ అంగన్‌వాడీ కేంద్రాలను వెంటనే రద్దు చేయాలి. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నూతన జాతీయ విద్యా విధానం చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలుచేయకుండా ఆపాలి. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు, మినీ టీచర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలి.వీటి కోసం అసెంబ్లీ బడ్జెట్ సమావేశంలో తగిన కేటాయింపులు జరపాలి.దేశంలోని వివిధ రాష్ట్రాలతో పాటు మన రాష్ట్రంలో ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సర్వీసెస్ (ఐసీడీఎస్)లు ప్రారంభమై యాభై ఏండ్లవుతున్నది. ఆ కాలంలో ఐసీడీఎస్ సేవలు అనేక మన్ననలు పొందాయి. ఐసీడీఎస్‌ను సంస్థాగతంగా బలోపేతం చేయాలని, ఇం దులో పనిచేస్తున్న అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లను పర్మినెంట్ చేయాలని అనేక సంస్థలు, సుప్రీంకోర్టు, గుజరాత్ హైకోర్టు తెలియజేశాయి. ఈ అంశాలను పరిశీలించి పరిష్కరించాల్సిన కేంద్ర ప్రభుత్వం తన బాధ్యతను నిర్వహించడం లేదు. పైగా పేద ప్రజలతో పాటు అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు నష్టం కలిగించే ఐసీడీఎస్ ప్రైవేటీకర ణ నిర్ణయాలు అనేకం చేసింది. ఇలాంటి పరిస్థితిలో అనేక హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. గత ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నమ్మాం. కానీ, అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వం మా సమస్యలను పట్టించుకోవడం లేదు. ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదు. ఓట్ల కోసం ఎన్నికల ముందు మమ్మల్ని వాడుకుని, ఇప్పుడు విస్మరిస్తున్నారు. దీని ప్రభావం అంగన్‌వాడీ కేంద్రాలపై పడుతున్నది. అధికారంలోకి వచ్చిన అనంతరం అంగన్‌వాడీల వ్యతిరేక విధానాలు అమలు చేయాలని చూడడం అన్యాయం. ఐసీడీఎస్, అంగన్‌వాడీలకు పోటీగా 3 నుంచి 6 సంవత్సరాల పిల్లలతో పీఎంశ్రీ పథకం కింద ప్రీ ప్రైమరీ (ఎలిమెంటరీ) కేంద్రాలను ఏర్పాటు చేయాలని తలపెట్టారు. ఈ మేరకు 28 జిల్లాల్లో కలిపి 56 కేంద్రాలను ప్రారంభించాలని ప్రభుత్వం చూస్తున్నది. అయితే ఈ నిర్ణయం ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసే చర్యలు తప్ప మరొకటి కాదు.రాష్ట్రంలో మొబైల్ అంగన్‌వాడీ సేవల పేరుతో ప్రభుత్వం కొత్త విధానాన్ని తెస్తుందని తెలిసింది. ఇది కూడా ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసే చర్యనే. దీనివల్ల అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్లు, హెల్పర్లు అందించే సేవలు ప్రజలకు దూరమవుతాయి. ఇవేవీ లేకుండా కేవలం ప్రజలకు టీహెచ్‌ఆర్ ఇస్తే సరిపోతుందని ప్రభుత్వం చెప్పకనే చెప్తున్నది. వీటితో పాటు వచ్చే విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రంలో నూతన జాతీయ విద్యా విధానం చట్టాన్ని అమలు చేయాలని ప్రభుత్వం చూస్తున్నది. మొత్తంగా ఐసీడీఎస్‌ను ప్రైవేటీకరణ చేయాలని ప్రభుత్వం చూస్తున్నది. ఇవన్నీ అమలు జరిగితే రాష్ట్రంలో క్రమంగా ఐసీడీఎస్ బలహీనపడి శాశ్వతంగా మూతపడే ప్రమాదం ఉన్నది. పేద ప్రజలతో పాటు అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు నష్టం కలిగించే ఇలాంటి నిర్ణయాలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలి.పై అంశాలతో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలి. 24 రోజుల సమ్మె సందర్భంగా గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు, కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపరిచిన హామీలు, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పోరాటాల సందర్భంగా ఇచ్చిన హామీలను, అంగన్‌వాడీలకు సుప్రీంకోర్టు, గుజరాత్ హైకోర్టు ఇచ్చిన తీర్పులను వెంటనే అమలు చేయాలి. వీటి పరిష్కారం కోసం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో కేటాయింపులు పెంచాలని కోరుతున్నాం. ఇప్పటికే ఈ నెల 17, 18 తేదీల్లో అన్ని జిల్లాల్లో కలెక్టరేట్ల ముందు ధర్నాలు చేయతలపెట్టాం. ఈ మేరకు అక్కడే 48 గంటల వంటావార్పు వంటి కార్యక్రమం నిర్వహిస్తున్నం. మా సమస్యలు పరిష్కరించకుంటే భవిష్యత్తు కార్యాచరణ కూడా ఉంటుంది. ఇప్పటికైనా మా న్యాయపరమైన డిమాండ్లు పరిష్కరించాలి.మా డిమాండ్లు ఇవీ వేతనాలు ప్రతి నెల 1వ తేదీన చెల్లించాలి. ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసే పీఎం శ్రీ పథకాన్ని పూర్తిగా రద్దు చేయాలి. ఈ నిధులను ఐసీడీఎస్‌కే కేటాయించాలి. మొబైల్ అంగన్‌వాడీ సెంటర్లను రద్దు చేయాలి. పాత విధానంలోనే ఐసీడీఎస్‌ను కొనసాగించాలి. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నూతన జాతీయ విద్యా విధానం చట్టాన్ని అమలు చేసే ప్రయత్నాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలి. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ, గుజరాత్ హైకోర్టు తీర్పు ప్రకారం పర్మినెంట్ చేయాలి. కాంగ్రెస్ ప్రభుత్వం తన మ్యానిఫెస్టోలో పొందుపరిచిన హామీల ప్రకారం రూ.18 వేల వేతనం చెల్లించాలి. వారికి పీఎఫ్ సౌకర్యం కల్పించాలి. మినీ అంగన్‌వాడీ నుంచి మెయిన్ అంగన్‌వాడీలుగా అప్‌గ్రేడ్ చేసినందువల్ల 4 వేల మంది అంగన్‌వాడీలకు 10 నెలల నుంచి జీతాలు నిలిపివేశారు. వాటిని వెంటనే విడుదల చేయాలి. మంత్రి సీతక్క ఇచ్చిన హామీ ప్రకారం రిటైర్మెంట్ బెనిఫిట్లు టీచర్లకు రూ. 2 లక్షలివ్వాలి. పెన్షన్, వీఆర్ఎస్ తదితర 23 డిమాండ్లను నెరవేర్చాలి.

### బజాజ్ ప్లాటినా.. హెూండా షైన్..

## ఇందులో ఏది బెటర్.. ఎంత మైలేజీ!



ప్రజలు బైక్ కొనడానికి వెళ్లినప్పుడల్లా, సరసమైన ధరలో మంచి మైలేజీని ఇచ్చే బైక్‌ను కొనాలని భావిస్తుంటారు. మెరుగైన మైలేజీకి పేరుగాంచిన ఇటువంటి అనేక బైక్‌లు ఇండియన్ మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. ఈ బైక్‌లలో బజాజ్ ప్లాటినా, హెూండా షైన్ అనే రెండు పాపులర్ బైకులు కూడా ఉన్నాయి. బజాజ్ ప్లాటినా, హెూండా షైన్ మధ్య ఏ బైక్ ఎక్కువ మైలేజీని ఇస్తుందో చూద్దాం..

**బజాజ్ ప్లాటినా 100:** బజాజ్ ప్లాటినా 100లో కంపెనీ 102 సిసి ఇంజన్‌ని అందించింది. ఈ ఇంజన్ గరిష్టంగా 7.9 %బీూ% పవర్‌తో 8.3 గరిష్ట టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. అలాగే ఈ బైక్ బరువు దాదాపు 117 కిలోలు. ఈ బైక్‌లో డ్రమ్ బ్రేక్‌లు అందించింది. దీనితో పాటు, 11 లీటర్ ఇంధన ట్యాంక్ కూడా ఉంది., స్పీడోమీటర్, ఫ్యూయల్ గేజ్, టాకోమీటర్, యాంటీ-స్కిడ్ బ్రేకింగ్ సిస్టమ్, 200 %ఎఎ% గ్రౌండ్ క్లియరెన్స్ కూడా ఈ బైక్‌లో కనిపిస్తాయి.

**హెూండా షైన్:** హెూండా షైన్ బైక్ గురించి మాట్లాడినట్లయితే.. ఈ శక్తివంతమైన బైక్‌లో 123.94 సిసి, 4-స్ట్రోక్, ఎస్ఐ, బిఎస్ ఇంజన్‌ని అమర్చారు. ఈ ఇంజన్ 7,500 వద్ద 7.9 శక్తిని అందిస్తుంది. 6,000 వద్ద 11 టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. అలాగే ఈ ఇంజన్‌తో 5-స్పీడ్ ట్రాన్స్‌మిషన్ కూడా అనుబంధించి ఉంది. ఈ బైక్ ఐదు రంగుల ఆప్షన్‌లలో మార్కెట్లో అందుబాటులో ఉంది.

### బజాజ్ ప్లాటినా, హెూండా షైన్ ఇందులో ఏది మంచిది?

బజాజ్ ప్లాటినా 100 అత్యధిక మైలేజ్ బైక్‌లలో ఒకటిగా పరిగణిస్తారు. బజాజ్ ప్లాటినా 100 మైలేజ్ లీటరుకు 72 కిలోమీటర్లు అని కంపెనీ పేర్కొంది. హెూండా షైన్ 55 %ఎఏజూశ్రీ% మైలేజీని ఇస్తుంది. ఈ బైక్ ఫ్యూయల్ ట్యాంక్ కెపాసిటీ 10.5 లీటర్లు. ఈ బైక్ ఒక్కసారిగా ట్యాంక్‌ను నింపడం ద్వారా 550 కిలోమీటర్ల వరకు ప్రయాణించవచ్చు.

## జీఎస్టీ వసూళ్లు 1.77 లక్షల కోట్లు


**గతంతో పోల్చితే డిసెంబర్‌లో 7.3 శాతం వృద్ధి**




వస్తు, సేవల పన్ను వసూళ్లు అంతకంతకు పెరుగుతున్నాయి. గడిచిన సంవత్సరం చివరి నెలలో రూ.1.77 లక్షల కోట్ల జీఎస్టీ వసూలైనట్లు కేంద్ర ప్రభుత్వం తాజాగా వెల్లడించింది. దీంట్లో సెంట్రల్ జీఎస్టీ కింద రూ.32,836 కోట్లు వసూలవగా, స్టేట్ జీఎస్టీ కింద రూ.40,499 కోట్లు, ఇంటిగ్రేటెడ్ జీఎస్టీ కింద రూ. 47,783 కోట్లు, సెస్ రూపంలో రూ.11, 471 కోట్లు వసూలయ్యాయి. అలాగే రూ.22,490 కోట్లు రిఫండ్ రూపంలో చెల్లింపులు జరిపింది. మొత్తంగా డిసెంబర్‌లో రూ.1.77 లక్షల కోట్లు వసూలైనట్లు, క్రితం ఏడాది ఇదే నెలలో వసూలైన రూ.1.65 లక్షల కోట్లతో పోలిస్తే 7.3 శాతం అధికమని పేర్కొంది. దీంట్లో దేశీయంగా జరిపే లావాదేవీలపై విధించిన జీఎస్టీతో రూ.1.32 లక్షల కోట్లు సమకూరగా, దిగుమతి చేసుకునే వస్తువులపై విధిస్తున్న పన్నులతో మరో రూ.44,268 కోట్లు సమకూరాయి. నవంబర్ నెలలో రూ.1.82 లక్షల కోట్ల పన్ను వసూలైంది. జీఎస్టీ అమలులోకి వచ్చిన తర్వాత ఏప్రిల్ 2024లో అత్యధికంగా రూ.2.10 లక్షల కోట్లు వసూలయ్యాయి.

## జోరుగా యూపీఐ లావాదేవీలు

**డిసెంబర్‌లో 8% ఎగిసి రూ.23 లక్షల కోట్లకు**




దేశంలో ఆన్‌లైన్ పేమెంట్స్ జోరుగా సాగుతున్నాయి. యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) లావాదేవీలు గత నెల డిసెంబర్‌లో 8 శాతం ఎగిసి 1,673 కోట్లుగా నమోదయ్యాయి. భారత్‌లో యూపీఐ లావాదేవీలు మొదలైన (2016 ఏప్రిల్) దగ్గర్నుంచి ఇదే అత్యధికం కావడం గమనార్హం. వీటి విలువ కూడా 8 శాతం ఎగబాకి రూ.23.25 లక్షల కోట్లకు చేరింది. నిరుడు అక్టోబర్ (రూ.23.50 లక్షల కోట్లు) తర్వాత ఇదే గరిష్ఠం. నవంబర్‌లో రూ.21.55 లక్షల కోట్లుగా ఉన్నాయి. ఇక నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) వివరాల ప్రకారం గత ఏడాది మొత్తంగా దేశంలో 17,200 కోట్ల యూపీఐ లావాదేవీలు జరిగాయి. 2023తో పోల్చితే ఇది 46 శాతం ఎక్కువ. నాడు 11,800 కోట్లే లావాదేవీలే. విలువపరంగా చూస్తే.. రూ.183 లక్షల కోట్ల నుంచి రూ.247 లక్షల కోట్లకు పెరిగింది. దీంతో 35 శాతం వృద్ధిచెందినైట్టెంది. కాగా, నవంబర్‌తో పోల్చితే రోజువారీ లావాదేవీలు డిసెంబర్‌లో 51.6 కోట్ల నుంచి 54 కోట్లకు పెరిగాయి. విలువ కూడా రూ.71,840 కోట్ల నుంచి రూ.74,990 కోట్లకు ఎగిసింది. ఇదిలావుంటే ఐఎంపీఎస్ లావాదేవీలు నవంబర్‌తో చూస్తే డిసెంబర్‌లో 8 శాతం పుంజుకొన్నాయి.

## తొలి రోజు రూ.79 వేలు దాటిన బంగారం అదే బాటలో వెండి



కొత్త సంవత్సరంలో తొలి రోజు బులియన్ మార్కెట్లో ధగధగలు నమోదయ్యాయి. బుధవారం దేశ రాజధాని ఢిల్లీలో 99.9 శాతం స్వచ్ఛత గల బంగారం ధర తులం రూ.440 వృద్ధి చెంది రూ.79,390 పలికింది. స్టాకిస్టులు తాజాగా కొనుగోళ్లకు ప్రాధాన్యం ఇవ్వడంతో బంగారం ధర పెరిగింది. మంగళవారం తులం బంగారం ధర (99.9 శాతం స్వచ్ఛత) రూ.78,950 పలికింది. ఇక 99.5 శాతం స్వచ్ఛత గల బంగారం తులం ధర బుధవారం రూ.440 వృద్ధితో రూ.78,840లకు చేరుకున్నది. మంగళవారం 99.5 శాతం స్వచ్ఛత గల బంగారం ధర రూ.78,400 వద్ద స్థిర పడింది. మరోవైపు దేశ రాజధాని ఢిల్లీలో కిలో వెండి ధర రూ.800 వృద్ధితో రూ.90,500 వద్ద స్థిర పడింది. మంగళవారం కిలో వెండి ధర రూ.89,700 పలికింది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్) లో గోల్డ్ కాంట్రాక్ట్స్ ఫిబ్రవరి డెలివరీ బంగారం తులం ధర ఫ్లాట్‌గా రూ.76,893 పలికింది. సిల్వర్ కాంట్రాక్ట్ మార్చి డెలివరీ కిలో వెండి ధర రూ.28 పతనమై రూ.87,550 వద్ద స్థిర పడింది. నూతన సంవత్సరం సందర్భంగా అంతర్జాతీయ మార్కెట్లకు బుధవారం సెలవు అని హెచ్డీఎఫ్సీ సెక్యూరిటీస్ కమోడిటీస్ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు.

## కస్టమర్లను ఆకట్టుకునేందుకు.. ఈవీలపై రాయితీల వర్షం

**టాటా, మహీంద్రా, హీరో, ఏథర్ వాహనాలు చౌక**

**పాపులర్ మాడళ్లపై రూ.3 లక్షల వరకు డిస్కౌంట్లు**



విద్యుత్తు ఆధారిత వాహన (ఈవీ) ధరలు దిగొస్తున్నాయి. మార్కెట్‌లోని టాప్ కంపెనీలు తమ పాపులర్ మాడళ్లపై భారీ రాయితీలను ప్రకటించాయి. టాటా, మహీంద్రా, హీరో, ఏథర్ సంస్థలు ఆయా ఈవీలపై ఏకంగా రూ.3 లక్షలదాకా రేట్లను తగ్గించడం విశేషం. డిస్కౌంట్లున్న ఈవీల్లో కార్లు, బైకులు కూడా ఉండటం గమనార్హం. సంప్రదాయ ఇంధన (పెట్రోల్ లేదా డీజిల్) ఆధారిత వాహనాలు కాలుష్యానికి దారి తీస్తున్న నేపథ్యంలో అటు వాహనదారులు, ఇటు ప్రభుత్వాలు ఈవీల కొనుగోళ్లను ప్రోత్సహిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే గత కొన్నేండ్లుగా ఆటో అమ్మకాల్లో ఈవీల వాటా సైతం పెరిగింది. అయినప్పటికీ ఈవీలపై తయారీదారులు పెద్ద ఎత్తున డిస్కౌంట్లు ప్రకటించడం మారిన మార్కెట్ పరిస్థితులకు అద్దం పడుతున్నది.

### ఇదీ సంగతి..

డిమాండ్‌కు మించి పెరిగిన ఉత్పత్తి, డీలర్ల వద్ద పేరుకుపోయిన వాహన నిల్వలు, తగ్గిన విడిభాగాల ధరలు.. మార్కెట్‌లో ఎలక్ట్రిక్ వెహికిల్స్ రేట్లపై డిస్కౌంట్లకు కారణమయ్యాయి. కొత్తగా వచ్చిన కార్పొరేట్ యావరేజ్ ఫ్యూయెల్ ఎఫీషియెన్సీ (కేఫ్) రెగ్యులేషన్లు కూడా ఇప్పుడున్న మాడళ్లపై ధరల తగ్గింపు దిశగా కంపెనీలను నడిపించాయని ఇండస్ట్రీ వర్గాలు చెప్తున్నాయి. ఈ క్రమంలోనే టాటా నెక్సాన్, మహీంద్రా ఎక్స్‌యూవీ400, హీరో వీ1 ప్రో-వీ1 ప్లస్, ఏథర్ 450-రిజ్టా మాడళ్లు చౌకయ్యాయని పేర్కొంటున్నాయి. చివరకు ఆన్‌లైన్ మార్కెటీర్ ఫ్లిప్‌కార్ట్ కూడా ఎలక్ట్రిక్ టూవీలర్లపై రూ.2,500-5,000 మేర ధరల్ని తగ్గించేసింది. ఇక ఈ డిస్కౌంట్లలో ఎక్కువ భాగం వాహన తయారీ సంస్థలు భరిస్తుండగా, మిగతా వాటాను డీలర్లు మోస్తున్నారు. ఎక్స్ఛేంజ్ బోనస్‌లు రూ.15,000 వరకు ఇస్తుండగా, ట్రేడ్ డిస్కౌంట్లు రూ.3,000-5,000 మధ్య ఉన్నాయి. మొత్తానికి దసరా, దీపావళి, క్రిస్మస్, న్యూ ఇయర్ జోష్‌ను అందిపుచ్చుకున్న వాహన రంగ కంపెనీలు.. పొంగల్, సంక్రాంతి ఉత్సాహాన్నీ క్యాష్ చేసుకోవాలని చూస్తున్నాయి.

### ఈ ఏడాది 15 కొత్త మాడల్స్

ఈ ఏడాది దేశీయ మార్కెట్‌లోకి ఏకంగా 15 కొత్త ఈవీలు రావచ్చని సమాచారం. అందులో మారుతీ సుజుకీ నుంచి ఈ-విటారా కూడా ఉండొచ్చని తెలుస్తున్నది. ఇక ఇప్పటికే దేశీయ ఈవీ మార్కెట్‌ను శాసిస్తున్న టాటా మోటర్స్ నుంచి సఫారీ, హారియర్ ఈవీ రకాలు రావచ్చని అంటున్నారు. అలాగే సియెర్రా ఈవీ పరిచయం కాబోతున్నట్టు చెప్తున్నారు. ఈ రెండు నెలల్లోనే ఇవి మార్కెట్‌కు వస్తాయని అంచనా. గత ఏడాది పంచ్, కర్వ్ ఈవీలను మార్కెట్‌లోకి టాటా తీసుకొచ్చిన సంగతి విదితమే. మరోవైపు మహీంద్రా నుంచి ఎక్స్‌యూవీ700, ఎక్స్‌యూవీ4ఎక్స్‌వో ఈవీలు రావచ్చని తెలుస్తోంది. ఇక హ్యుందాయ్ పాపులర్ మాడల్ క్రెటా కూడా ఈవీగా అందుబాటులోకి రాబోతున్నది. కియా ఈవీ5, ఎంజీ సైబర్‌స్టార్ వంటివి కూడా ఈ లిస్టులో ఉన్నాయి. కాగా, 2030 నాటికి భారతీయ మార్కెట్‌లో ఎలక్ట్రిక్ టూవీలర్ల వాటా దాదాపు 25 శాతానికి, ఈవీ ప్యాసింజర్ కార్ల వాటా 15 శాతానికి చేరవచ్చని ఇండస్ట్రీ నిపుణులు అంచనా వేస్తున్నారు. మారుతీ, టయోట, హ్యుందాయ్, హీరో, బజాజ్, టీవీఎస్, హెూండా తదితర ప్రధాన సంస్థలు ఈవీ మార్కెట్‌పై దృష్టి పెడితే దేశీయ ఈవీ మార్కెట్ పరుగులు పెడుతుందని కూడా వారు విశ్లేషిస్తున్నారు.

ఎలక్ట్రిక్ వాహనాలపై రాయితీలు ఇలా..



| | | |
|---|---|---|
| టాటా | నెక్సాన్ | ₹3,00,000 |
| మహీంద్రా | ఎక్స్‌యూవీ400 | ₹3,00,000 |
| హీరో వీ1 ప్రో | | ₹25,000 |
| హీరో వీ1 ప్లస్ | | ₹10,000 |
| ఏథర్ 450 | | ₹5,000-7,000 |
| ఏథర్ రిజ్టా | | ₹3,000-6,700 |

## రికార్డుస్థాయికి ప్యాసింజర్ వాహనాల సేల్స్ టాప్‌గేర్‌లో మారుతి సుజుకీ









దేశవ్యాప్తంగా ప్యాసింజర్ వాహన విక్రయాలు టాప్‌గేర్‌లో దూసుకుపోతున్నాయి. గడిచిన సంవత్సరానికిగాను దేశీయంగా 43 లక్షల యూనిట్ల ప్యాసింజర్ వాహనాలు అమ్ముడయ్యాయి. వాహన దిగ్గజాలైన మారుతి సుజుకీ, హ్యుందాయ్, టాటా మోటర్స్, టయోటా కిర్లోస్కర్ మోటర్, కియాలు అత్యధిక వార్షిక వృద్ధిని నమోదు చేసుకోవడం ఇందుకు కలిసొచ్చింది. పీవీల విక్రయాలు దూసుకోవడానికి ప్రధానంగా గ్రామీణ ప్రాంత మార్కెట్ చాలా కీలక పాత్ర పోషించిందని, 2023లో అమ్ముడైన 41.1 లక్షల యూనిట్లతో పోలిస్తే రెండంకెల వృద్ధి నమోదైందని మారుతి సుజుకీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ అధికారి పార్థో బెనర్జీ తెలిపారు. గతేడాదిలో మారుతి అత్యధికంగా 17,90,977 యూనిట్ల ప్యాసింజర్ వాహనాలను విక్రయించింది. చిన్న స్థాయి నగరాలు, పట్టణాల్లో సైతం రిటైల్ అవుట్‌లెట్లను తెరవడానికి తీసుకున్న చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయని,

డిసెంబర్‌లో వాహన అమ్మకాలు

| సంస్థ | 2024 | 2023 | వృద్ధి (%లో) |
|---|---|---|---|
| మారుతి సుజుకీ | 1,78,248 | 1,37,551 | 30 |
| హ్యుందాయ్ | 55,078 | 56,450 | -2 |
| ఆడీ ఇండియా | 5,816 | 7,931 | -27 |
| టయోటా కిర్లోస్కర్ | 29,529 | 22,867 | 29 |
| మహీంద్రా | 69,768 | 41,424 | 16 |
| వీఈ కమర్షియల్ | 8,324 | 8,026 | 3.7 |
| నిస్సాన్ మోటర్ | 11,676 | 7,711 | 51.42 |
| జేఎస్‌డబ్ల్యూ ఎంజీ | 7,516 | 3,785 | 55 |
| బజాజ్ ఆటో | 3,23,125 | 3,26,806 | -1 |
| సుజుకీ మోటర్‌సైకిల్ | 96,804 | 78,834 | 22 |

### గత ఏడాది కంపెనీల వాహన విక్రయాలు

మారుతి సుజుకీ 17,90,977 యూనిట్ల వాహనాలను విక్రయించింది.

హ్యుందాయ్ మోటర్ ఇండియా అత్యధికంగా 6,05,433 యూనిట్ల అమ్మకాలు జరిపింది. వీటిలో ఎస్‌యూవీ వాహనాల వాటా 67.6 శాతంగా ఉన్నది.

### టాటా మోటర్స్ 5.65 లక్షల వాహనాలను విక్రయించింది.

టయోటా కిర్లోస్కర్ మోటర్ రికార్డు స్థాయిలో గతేడాది 3,26,329 యూనిట్ల వాహన అమ్మకాలు జరిపింది. 2023లో విక్రయించిన 2,33,346 యూనిట్లతో పోలిస్తే 40 శాతం అధికం.

## ఈ పొరపాట్లు చేయకండి అప్పుల్లో కూరుకుపోకండి!!

కొత్త ఏడాది ప్రవేశించి అప్పుడే వారం రోజులు గడిచిపోయాయి. ఇంకా అలాగే ఆలోచిస్తూ కూర్చుంటే మరో వారం, నెల.. ఇలా గడిచిపోతూనే ఉంటాయి. కరిగిపోవడం కాలం లక్షణం. కాలం కన్నా వేగంగా తరిగిపోవడం డబ్బుకున్న అవలక్షణం. పొదుపు మంత్రంతో దీన్ని సరిదిద్దొచ్చు. మదుపు తంత్రంతో ఈ అవగుణం తిరగబడకుండా చూసుకోవచ్చు. అలాగని ఏడాదిలోనే లక్షలు ఇన్వెస్ట్ చేసి కోట్లకు పడగలెత్తేలా పరుగులు తీయమని చెప్పటం కాదు. ఆదాయ, వ్యయాల చిట్టాలో చిట్టిపొట్టి సవరింపులతో గట్టి ప్రయోజనాలు పొందే అవకాశాలు ఉంటాయి. గతేడాది చేసిన తప్పులను దిద్దుకుంటే ఈ నయా సాల్%ొ% నయా దౌర్‌కు నాంది పలుకుతుంది. ఆర్థిక వ్యవహారాలపైనే కుటుంబ జీవితం ఆధారపడి ఉంటుంది. నెల మొదలై పది రోజులు గడవకముందే చేబదులు కోసం స్నేహితుడికి మెసేజ్ చేస్తున్నారంటే.. మనీ మేనేజ్‌మెంట్‌లో మీరు ఫెయిల్ అవుతున్నారని అర్థం. మీ ఫోన్‌లో లోన్ యాప్‌లు ఉన్నాయంటే ప్రమాదానికి దగ్గరవుతున్నారని అర్థం. లోన్లు కావాలా అంటూ రెగ్యులర్‌గా కాల్స్ వస్తున్నాయంటే.. ఆర్థికంగా మీరు చతికిలపడ్డారని అర్థం చేసుకోవచ్చు. ఇవేం తీర్చిదిద్దుకోలేని తప్పిదాలు కావు. కాస్త అప్రమత్తంగా ఉంటే.. ఒక్కో సమస్యను నెగ్గుకురావొచ్చు.




### ఆదాయం ..వ్యయం

ఆదాయానికి మించిన ఖర్చులు ఎప్పటికైనా ముంచేస్తాయి. అయితే ఆదాయం పెంచుకోవాలి. లేదా ఖర్చులు తగ్గించుకోవాలి. రాబడికి లోబడి వ్యయం ఉన్నంత కాలం సేఫ్ జోన్‌లో ఉన్నట్టే. వెచ్చాలు మొదలుకొని విహారాల వరకు ఖర్చు ఎక్కడ అదుపు తప్పుతుందో లెక్కలేసుకొని వాటిని సరిదిద్దుకునే ప్రయత్నం చేయాలి.

### అప్పులు తీర్చడానికి అప్పొద్దు

పరిమితికి లోబడి తీసుకునే అప్పు తప్పు కాదు. ఇంటి కోసం అప్పు మంచిదే! కూతురు పెండ్లి కోసం అప్పు చేయడమూ మన్నించదగినదే! అంతేకానీ, రుణభారం తగ్గించుకోవడానికి, వడ్డీ కింద వడ్డించడానికి అప్పు చేస్తున్నట్లయితే ఆ రుణం ఆజన్మాంతం వెంటాడే ప్రమాదం ఉంది. అటువంటి పరిస్థితుల్లో ఉన్నట్లయితే ఏదైనా నిరర్థకమైన ఆస్తిని అమ్మి అయినా.. అప్పుల ఊబి నుంచి బయట పడటం తెలివైన పని.

### కాపీలొద్దు బాసూ!

సంపన్నులు కావడం వేరు, అలా కనిపించడం వేరు. స్థితిమంతులుగా ఎదగాలి అనుకోవడం మంచి లక్షణం. బంధువుల్లో గొప్ప అనిపించుకోవడం కోసం, కాలనీ వాసుల పొగడ్తల కోసం లేనిపోని డాబులకు పోతే ఆర్థికంగా చతికిలపడటం ఖాయం. స్నేహితుడు కొత్త కారు కొన్నాడని.. స్థాయి లేకున్నా కారు కొనడం, బంధువు డబుల్ బెడ్‌రూం ఫ్లాట్‌లో ఉంటున్నాడని.. ట్రిపుల్ బెడ్‌రూం ఇంట్లోకి మారడం ఇబ్బందులకు దారితీస్తుంది. కాపీ చేయడం మొదలుపెడితే.. జిందగీ కష్టాల సుడి గుండంలో చిక్కుకుంటుంది. ఉన్నదాన్ని పెంచుకునే ప్రయత్నం చేయాలి. అందులోనే ఉన్నతంగా జీవించాలి.

### కీడెంచి మేలెంచు..

సంపాదించే వ్యక్తులు దూరమైతే ఆ కుటుంబ పరిస్థితి అగమ్యగోచరంగా తయారవుతుంది. కుటుంబసభ్యుల్లో ఎవరికైనా తీవ్రమైన జబ్బు చేసినా వైద్యానికయ్యే ఖర్చు ఆ కుటుంబాన్ని ఆర్థికంగా పదేండ్లు వెనక్కి తోసేస్తుంది. ఇలాంటి సందర్భాలు తలెత్తినా ధైర్యంగా ఉండటానికి సరిపడా జీవిత బీమా, ఆరోగ్య బీమా తీసుకోవడం అనివార్యం అని గుర్తుంచుకోండి.

### కనీసం ఎనిమిదేండ్లు

షేర్ మార్కెట్ ఎగాదిగా పెరిగిపోతున్నది.. ఈక్విటీ షేర్లతో ఏడాదిలో కరోడ్‌పతీ అయిపోతానంటే కుదరదు. ఈక్విటీ, షేర్ మార్కెట్ లాంగ్‌టర్మ్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్స్! బంగారం, భూమి కూడా ఈ కోవకే వస్తాయి. కనీసం ఎనిమిదేండ్లు వేచిచూసే ఓపిక ఉంటేనే వీటిలో ఇన్వెస్ట్ చేయాలి. ఫైనల్‌గా.. నెలంతా కష్టపడితే వచ్చిన డబ్బులను.. వారంలో ఖర్చు చేసే పరిస్థితులు ఉన్నాయంటే మనీ మేనేజ్‌మెంట్‌లో వెనకబడినట్టే. రాబడి పెంచుకునే అవకాశం లేకపోతే.. ఖర్చు తగ్గించుకోవడం దినచర్యగా చేసుకోవాలి. వృథా ఖర్చులకు అడ్డుకట్ట వేయడం కూడా సంపాదించడం వంటిదే! 2025 క్యాలెండర్ గోడమీదికి ఎక్కేలోగా.. కొంతైనా మార్పు తీసుకురాగలిగితే ప్రతి ఏడాదీ పసందుగానే సాగిపోతుంది.

### ప్రణాళికతో..

ఖర్చులు ఎంత నియంత్రించుకున్నా ఒక్క ఏడాదిలో లక్షాధికారులుగా మారిపోరు. మీ భవిష్యత్ అవసరాలకు తగ్గట్టుగా ప్రణాళిక బద్ధంగా పొదుపు, మదుపు చేయడం ద్వారా.. ఆయా అవసరాలు వచ్చినప్పుడు ఏ ఇబ్బందీ తలెత్తదు. అమ్మాయిని డాక్టర్ చదివించాలని అనుకుంటే సరిపోదు. పదిహేనేండ్ల తర్వాత ఎంబీబీఎస్ చదవడానికి ఖర్చు ఎంత ఉంటుందనే అంచనా వేసుకొని, అంత మొత్తం వచ్చేలా మ్యూచువల్ ఫండ్స్‌లోనో, ఈక్విటీలోనో ఇన్వెస్ట్ చేయాలి. ఆ లెక్కలేం మాకు తెలియవు అనుకుంటే.. ఏడాదికి కనీసం లక్ష రూపాయల చొప్పున పొదుపు చేయగలిగితే.. కూతురు ఎంబీబీఎస్‌కు వచ్చేసరికి కనీసం 20 లక్షలు చేతిలో ఉంటాయి. ఇలా ప్రణాళికతో సాగితే.. అప్పుల ఊబిలో కూరుకుపోయే ప్రమాదం రాదు.

Editor, printed and owned by Bommarboyina Venkanna, Associate Editor K Rajendra Prasad “office: Amber Nagar, Parshigutta, Secundrabad, Cell.no: 099592 36324, 9912824332